

డిఎల్‌పిఒ విచారణ

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మండలంలోని ముషిడిపల్లి పంచాయతీ పరిధిలో స్వప్నలోకం లేఅవుట్‌కు తప్పుడు పత్రాలతో తీర్మానాలు సృష్టించి రోడ్డు వేశారని పంచాయతీ సర్పంచ్, ఎంపిటిసి గతంలో జిల్లా కలెక్టర్‌కు చేసిన ఫిర్యాదుపై డిఎల్‌పిఒ మోహన్‌రావు మంగళవారం ముషిడిపల్లి పంచాయతీ కార్యాలయంలో విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి అనిల్ ఆధ్వర్యంలో ఈ లేఅవుట్‌కు రోడ్డు ఏర్పాటుపై చేసిన ప్రతిపాదన రికార్డులను ఆయన పరిశీలించారు. తీర్మానం చేసిన రికార్డులు కనిపించడం లేదని సచివాలయ సిబ్బంది తెలపడంతో ఆయన ఒక్కసారిగా ఆశ్చర్యపోయారు. దీంతో పలు అనుమా నాలకు తావిస్తుందని అంటూనే ఈ విషయాన్ని ఆయన నోట్ చేసుకున్నారు. ఎంపిటిసి సుధారాజు, గ్రామ పెద్ద సోలుబొంగు కనకం సమక్షంలో ఈ లేఅవుట్ రోడ్డుకు ప్రతిపాదన చేసిన సమయంలో పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన ఎస్ఎస్ దేవుడును వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం రోడ్డును పరిశీలించారు.

జీతాల కోసం ఎదురుచూపులు

- మూడు నెలలుగా అందని వేతనాలులు
- ఆందోళనలో ఉపాధ్యాయులు
- సెప్టెంబర్ నెలా కష్టమే..

విజయనగరం మండలంలో పనిచేస్తున్న ఇద్దరు ఎస్‌జిటి ఉపాధ్యాయులు (భార్యాభర్తలు) ఇటీవల జరిగిన బదిలీల్లో పక్క మండలానికి వెళ్లారు. అయితే మూడు నెలలుగా వీరికి జీతాలు లేవు. లోన్ తీసుకొని ఇల్లు నిర్మించుకున్న వీరు బ్యాంకుకు ప్రతినెలా 5న ఇఎంఐ చెల్లించాల్సి ఉంది. కానీ జీతాలు రాకపోవటంతో ఇఎంఐలు కట్టడానికి అప్పులు చేస్తున్నారు. ఇంట్లో ఇద్దరికీ జీతాలు రాకపోవటంతో ఆర్థిక పరిస్థితి కష్టంగా ఉందని వాపోతున్నారు. మరోవైపు తాజాగా విద్యాశాఖ చేపట్టిన పనిసర్దుబాటు వీరి పేర్లు కూడా ఉండటంతో పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్లుగా ఉంది వీరి పరిస్థితి. జిల్లాలో బదిలీలు పొందిన ఉపాధ్యాయులందరి పరిస్థితి దాదాపుగా ఇదే విధంగా ఉంది.



ఇటీవల వేతనాల కోసం యుటిఎఫ్ ఆధ్వర్యాన డిఇఒ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు (ఫైల్)

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలో బదిలీలు, ప్రమోషన్లు పొందిన ఉపాధ్యాయులకు మూడు నెలలుగా జీతాలు లేవు. బదిలీలు పొందిన కొత్త స్టేషన్లలో వీరి పేర్లు సిఎఫ్ఎంఎస్‌లో నమోదు చేసే ప్రక్రియ ఇప్పటికీ పూర్తి కాకపోవటంతో సెప్టెంబర్ 1న జీతాలు వస్తాయనే నమ్మకం లేదు. దీంతో వివిధ అవసరాల కోసం రుణాలు తీసుకున్న వారంతా ఇంట్లో అవసరాలకు డబ్బులు లేక ఇబ్బంది పడుతున్నారు. జిల్లాలో ఇటీవల 2927 మంది ఎస్‌జిటి, స్కూల్ అసిస్టెంట్ కేడర్ ఉపాధ్యాయులు బదిలీలు అయ్యారు. అలాగే 19 మంది ప్రమోషన్లు పొందారు. వీరందరికీ జూన్, జులై, ఆగస్ట్ జీతాలు పెండింగ్‌లో ఉన్నాయి. వీరు అప్పటి దాకా పనిచేసిన పాత స్టేషన్లో వేతన బిల్లులు వేసే డిడిఒ లాగిన్ నుండి బదిలీ పొందిన ఉపాధ్యాయుని పేరును తొలగించాల్సి ఉంటుంది. కొత్తగా బదిలీ పొందిన స్టేషన్ డిడిఒ సదరు ఉపాధ్యాయుడి పేరును తన పరిధిలో నమోదు చేసి, సిఎఫ్ఎంఎస్ అప్రూవల్ కోసం పంపించాలి. అప్రూవల్ రాగానే కొత్త ప్రాంతాల్లోని డిడిఒలు వేతన బిల్లులు వేయటానికి అవకాశం ఉంటుంది. కానీ ఈ ప్రక్రియ ఇప్పటికీ పూర్తి కాలేదు. ప్రతి నెలా 25వ తేదీలోగా ఉద్యోగుల వేతన బిల్లులు వేయాల్సి ఉంటుంది. కానీ బదిలీ, ప్రమోషన్ పొందిన ఉపాధ్యాయుల పేర్లు కొత్త డిడిల పరిధిలోనే నమోదు కాలేదు. ఒక వేళ ఎంత వేగంగా చేసిన కనీసం పది పదిహేను రోజులు పడుతుందని అంటున్నారు. దీంతో ఆగస్టు నెల జీతం సెప్టెంబర్ 1న కూడా వచ్చే అవకాశం కనిపించడం లేదు. దీంతో ఆయా ఉపాధ్యాయులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. వేతనాలు అందక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉపాధ్యాయులంతా వ్యక్తిగత లోన్లు, వాహన లోన్లు, హౌసింగ్ వంటి అనేక రుణాలు తీసుకొని ప్రతినెలా ఇఎంఐలు చెల్లించాల్సి ఉంది. సకాలంలో బ్యాంకు ఖాతాల్లో డబ్బులు లేక, పెనాల్టీలు కట్టాల్సి వస్తోందని వాపోతున్నారు. కాగా సిఎఫ్ఎంఎస్ ధ్రువీకరణకు పంపించాల్సిన అవసరం లేకుండానే డిడిఒలే ధ్రువీకరించే విధంగా కొద్ది రోజుల క్రితం ఉత్తర్వులు విడుదలైనా సాంకేతిక సమస్యలు ఎదురుతున్నాయని, దీంతో మళ్లీ సిఎస్ఎంఎస్ వారికే పంపించాల్సి వస్తుందని అధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉంటే తాజాగా విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా విద్యాశాఖ పని సర్దుబాటు ప్రక్రియ చేపట్టింది. దీంట్లో రెండు నెలల క్రితం బదిలీ అయిన వారూ ఉండటం గమనార్హం. ఇప్పటికే ఒక చోట నుండి మరొక చోటుకి బదిలీ అయిన వారు ఇప్పుడు ఇంకో పాఠశాలకు వెళ్లాల్సి రావటంతో ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ఉపాధ్యాయులను వేధింపులకు గురి చేస్తుందని ఉపాధ్యాయ సంఘాలు విమర్శిస్తున్నాయి.

ప్రజా సమస్యలపై సమర భేరి

నేటి నుంచి ఆరు రోజులపాటు సిపిఎం ఆధ్వర్యాన నిరసనలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి



ప్రజా సమస్యల పరిష్కారానికై సిపిఎం ఆధ్వర్యాన బుధవారం నుంచి సెప్టెంబర్ 4 వరకు ఆరు రోజులపాటు సమరభేరీ మోగించనున్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న సంగతి తెలిసిందే. సమస్యలను పరిష్కరించాలని, భారాలను ఉపసంహరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా సమరభేరి నిర్వహించేందుకు పార్టీ పిలుపునిచ్చింది. దీన్ని విజయవంతం చేయాలంటూ సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ తదితరులు ఇప్పటికే పిలుపునిచ్చారు. ఏటా కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని అధికారంలోకి వచ్చిన కేంద్రం మాట నిలబెట్టుకోలేదు. పైగా అవలంభించిన విధానాల వల్ల ప్రభుత్వ రంగ సంస్థల్లో అనేక మంది ఉద్యోగాలు కోల్పోయారు. దీంతో, నిరుద్యోగ సమస్యను మరింత తీవ్రతరమైంది. విశాఖ స్టీల్‌ప్లాంట్ వంటి సంస్థలను ప్రైవేటుపరం చేసేందుకు కంకణం కట్టుకుంది. దీంతో, ఉద్యోగులకు మరిన్ని సమస్యలు ఉత్పన్నం కావడంతోపాటు భవిష్యత్ తరాలకు ప్లాంట్‌లో ఉద్యోగ అవకాశాలు లేకుండా పోతాయి. మరోవైపు పెంచిన నిత్యావసర సరుకుల ధరల వల్ల పేద, మధ్యతరగతి ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యుత్ ఛార్జీలు, చెత్తపన్ను వంటివి మరింత గుదిబండగా పరిణమించాయి. ఇటీవల పెంచిన విద్యుత్తు ఛార్జీలు కూడా భారమయ్యాయి. జిల్లాలో జూట్, ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమల మూత వల్ల కార్మికులు ఉపాధి కోల్పోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.పాలకుల నిర్లక్ష్యం వల్ల జిల్లా ప్రజలు వలసలు కూడా ఆగడం లేదు. ఈ నేపథ్యంలో ఈనెల 30న ప్రభుత్వ మోసపూరిత విధానాలపై ప్రచారం, సంతకాల సేకరణ, సెప్టెంబర్ 1 గ్రామ, వార్డు సచివాలయాల్లో వినతుల సమర్పణ, 3న నిరుద్యోగ వ్యతిరేక దినం, 4న మండల కార్యాలయాల వద్ద ధర్నా కార్యక్రమాలు సిపిఎం ఆధ్వర్యాన చేపట్టనున్నారు.

ఎఫ్‌పిఒలకు సహకరించాలి

కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం

ఎఫ్‌పిఒల ద్వారా రైతులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించి వ్యవసాయాన్ని లాభదాయకంగా చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. మంగళవారం నాబార్డు ఆధ్వర్యంలో కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతు ఉత్పత్తిదారు కంపెనీలకు కావలసిన ఇన్‌పుట్ లైసెన్స్‌లను త్వరితగతిన జారీ చేయాలని సూచించారు. నాబార్డ్ ఆర్థిక సహకారంతో జిల్లాలో 28 రైతు ఉత్పత్తి కంపెనీలు ఏర్పాటయ్యాయని, వాటిలో ఎక్కువగా సేంద్రీయ ఉత్పత్తులు, చిరు ధాన్యాలు, కూరగాయలు, మామిడి, చెరకు తదితర ఉత్పత్తులపై పని చేస్తున్నాయని నాబార్డ్ డిడిఎం నాగార్జున కలెక్టర్‌కు తెలిపారు. వ్యవసాయ ఉత్పత్తులను నిల్వ చేసేందుకు అవసరమైన కలెక్షన్ కేంద్రాలను, స్టోరేజ్ లను ఏర్పాటు చేయాలని కోరారు. ఎఫ్‌పిఒల నిర్వహణలో ప్రమాణాలను పాటించాలని, ఎక్కువ మంది రైతులను భాగస్వామ్యం చేయాలని కలెక్టర్ సూచించారు. ఎఫ్‌పిఒలకు అన్ని వ్యవసాయ, అనుబంధ శాఖలు సహకరించాలని ఆయా శాఖల అధికారులకు ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనుల్లో మరమ్మతులకు తొలి ప్రాధాన్యం

- ఇంజినీరింగ్, విద్యాశాఖ అధికారులతో సమీక్షించిన కలెక్టర్
- సెప్టెంబర్ 15లోగా అదనపు తరగతి భవనాలను పూర్తి చేయాలి

ప్రజాశక్తి-విజయనగరం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

నాడు - నేడు రెండో దశలో భాగంగా జిల్లాలో చేపట్టిన పనుల్లో మేజర్, మైనర్ మరమ్మతులకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని, నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత గడువులోగా చేరుకోవాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి విద్యా, ఇంజనీరింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, కెజిబివిలు, అంగన్ వాడీల్లో జరుగుతున్న నాడు - నేడు రెండో దశ పనులపై కలెక్టరేట్ ఆడిటోరియంలో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో గుర్తించిన 731 పనుల ప్రస్తుత స్థితిపై కలెక్టర్ ఆరా తీశారు. 211 చోట్ల అదనపు తరగతి భవనాలకు అనుమతులు ఇచ్చినా ఇంకా కొన్ని చోట్ల పనులు ప్రారంభం కాకపోవటంపై కలెక్టర్ విచారం వ్యక్తం చేశారు. త్వరితగతిన పనులు చేపట్టి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ముందుగా డిఇఒ బి. లింగేశ్వరరెడ్డి పనుల నివేదికను వెల్లడించారు. జిల్లాలో జూనియర్ కళాశాలలు, పాఠశాలలు, అంగన్ వాడీల్లో 731 చోట్ల పనులు చేపట్టామని, అవన్నీ చివరి దశలో ఉన్నాయని వివరించారు.కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ నాడు-నేడు రెండో దశ పనుల్లో మరమ్మతులకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని, మరుగుదొడ్లు, కిచెన్ షెడ్లు నిర్మాణ పనులను త్వరతిగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అదనపు తరగతి భవనాలకు సంబంధించిన పనులను సెప్టెంబర్ 15వ తేదీ లోగా పూర్తి చేయాలని నిర్దేశించారు. జరుగుతున్న పనుల తాలూక నివేదికలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలని సూచించారు. విడుదల చేసిన నిధులను సమృద్ధిగా వినియోగించాలని చెప్పారు. ఒకవేళ ఎక్కడైనా అదనపు తరగతి భవనం అవసరం లేకపోతే తదుపరి చర్యల నిమిత్తం డిఇఒ ద్వారా తనకు తెలియజేయాలని కలెక్టర్ సూచించారు. సివిల్ వర్కులు పూర్తయిన చోట ఫర్నీచర్ వర్కులు వీలైనంత త్వరగా ప్రారంభించాలన్నారు. పనులకు సంబంధించి క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న కొన్ని సమస్యలను ఎంఇఒలు, ఇంజినీరింగ్ అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకు రాగా సానుకూలంగా స్పందించారు. రాష్ట్ర స్థాయి అధికారులతో మాట్లాడి పరిష్కార చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సమావేశంలో ఎస్ఎస్ఎ ఇఇ ఎం.శ్రీనివాసకుమార్, ఎంఇఒలు, హెచ్ఎంలు, డిఇలు, ఎఇలు, ఐసిడిఎస్ సిడిపిఒలు పాల్గొన్నారు.

గొడ్డుపాలెంలో డయేరియా

- ఒకరు మృతి
- ఆరుగురికి అస్వస్థత
- కొనసాగుతున్న వైద్య శిబిరం

ప్రజాశక్తి-దెంకాడ



ఇంటి వద్దే చికిత్స పొందుతున్న మహిళ

మండలంలోని వెదుళ్లవలస పంచాయతీ మధుర గ్రామం గొడ్డుపాలెంలో గత ఐదు రోజుల నుంచి డయేరియా వ్యాపించి ఆరుగురు అస్వస్థతకు గురయ్యారు. వీరిలో సత్యారావు అనే వ్యక్తి మృతి చెందాడు. మిగతా ఐదుగురూ చికిత్స పొందుతున్నారు. గ్రామ సర్పంచ్ కలిశెట్టి రామకృష్ణ ఆధ్వర్యంలో గ్రామంలో అపారిశుధ్యాన్ని నిర్మూలించి కాలువల్లో నిల్వ ఉన్న నీటిలో బ్లీచింగ్ చేయించారు. అయినప్పటికీ డయేరియా విజృంభించి ఆరుగురు అస్వస్థతకు గురయ్యారు. ఈ విషయాన్ని ఎఎన్ఎం ద్వారా మోపాడ పిహెచ్‌సికి సమాచారం అందించారు. దీంతో వైద్య సిబ్బంది గ్రామంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. రెండు రోజులుగా గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి రోగులకు అవసరమైన మందులు ఇస్తున్నారు. అస్వస్థతకు గురైన వారిలో కలిశెట్టి రామారావు, మామిడి సురేష్‌ను జిల్లా సర్వజన ఆస్పత్రికి తరలించారు.

పతివాడ రమణమ్మ, జయమ్మను గ్రామంలోనే ఉంచి వైద్యసేవలు అందిస్తున్నారు. వీరిలో పతివాడ జయమ్మ పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో దెంకాడ పిహెచ్‌సికి తరలించారు. పట్టా చందన ప్రియ అనే 9 ఏళ్ల పాప కూడా డయేరియాకు గురైంది. బాలికకు వైద్య సేవలందించడంతో కోలుకుంటోంది. అయితే గ్రామంలో అరకొర వైద్యమే అందిస్తున్నారని, పూర్తిస్థాయిలో సిబ్బంది గ్రామంలో పర్యటించలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మృతి చెందిన సత్యారావు ఆటో నడుపుకుంటూ జీవనం సాగించేవాడు.

అయితే తమకు మోపాడ పిహెచ్‌సిలో వైద్య సేవలు వద్దని, దెంకాడ పిహెచ్‌సిలోనే సేవందించాలని బాధితులు కోరుతున్నారు. గ్రామం నుంచి మోపాడు వెళ్లేందుకు సుమారు 15 కిలోమీటర్లు దూరం ఉంటుందని, అంతదూరం ఎలా వెళ్లగలమని ప్రశ్నిస్తున్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

- ఆటో వర్కర్స్ యూనియన్ డిమాండ్
- సెప్టెంబర్ 5,6,7 తేదీల్లో మండల కేంద్రాల్లో ధర్నాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 5,6,7 తేదీల్లో మండల కేంద్రాల్లో జరిగే నిరసన కార్యక్రమాలు విజయవంతం చేయాలని ఆలిండియా రోడ్డు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ కౌన్సిల్ సభ్యులు ఎ.జగన్మోహన్‌రావు పిలుపునిచ్చారు. మంగళ వారం ఎన్‌పిఆర్ భవన్‌లో ఆటో యూని యన్ నాయకులు లక్ష్మణరావు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈసందర్భంగా జగన్మోహన్‌రావు మాట్లాడుతూ రవాణారంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు కోసం జరిగే ఉద్యమంలో ఆటో డ్రైవర్లంతా పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపు నిచ్చారు. కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వాలకు కార్పొరేట్ల ప్రయోజనాల తప్ప, రవాణారంగ కార్మికుల సమస్యలు పట్టడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్ల భద్రత పేరుతో డ్రైవర్ల మెడకు ఉరితాడు బిగించారని, వాహన మిత్ర రూ.10వేలు ఇచ్చి డీజిల్, పెట్రోల్, ఈ చలానాలు, ఇన్సూరెన్స్, రెన్యువల్స్ ఫీజులు పెంచి వేళల్లో దోచుకుంటు న్నారని అన్నారు. డ్రైవర్లు అప్పులు పాలై ఆటోలో అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడు తుందని అన్నారు. అందుకే కేరళ తరహాలో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పట్టణంలో ఆటోలకు పార్కింగ్ స్థలాలు, డ్రైవర్లకు ఆటోనగర్లను ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమస్యలపై రాష్ట్ర వ్యాప్త ఉద్యమాన్ని నిర్మించేం దుకు సెప్టెంబర్ 16, 17తేదీల్లో కర్నూల్‌లో రాష్ట్ర వర్క్‌షాప్ లో చర్చిస్తామన్నారు. ఈ చలానా రద్దు కోసం, పార్కింగ్ స్థలాలు, పెట్రోల్, డీజిల్ జిఎస్‌టి పరిధిలోకి తేవాలని, డ్రైవర్లకు ఇళు ,ఇళ్ల స్థలాలు, లైసెన్స్ ఉన్న ప్రతి డ్రైవర్‌కూ వాహన మిత్ర అమలలు కోసం సెప్టెంబర్ 5, 6, 7 తేదీల్లో మండల కేంద్రాల్లో ధర్నాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సత్యారావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ధ్యానచంద్ స్ఫూర్తితో క్రీడల్లో రాణించాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ధ్యానచంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవం మంగళవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఎల్‌వి రమణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి.రామ్ గోపాల్ మాట్లాడుతూ జాతీయ ధ్యానచంద్ అంటే క్రీడలకు స్ఫూర్తి అన్నారు. అంతర్జాతీయ స్థాయిలో దేశ ప్రతిష్టను ఇనుమడింప చేసిన వ్యక్తి అని అన్నారు. అనంతరం స్కూల్ గేమ్స్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థుకు అవార్డులు అందజేశారు. మొదటి స్థానం పారాది, రెండో స్థానం తెర్లాం, మూడో స్థానం విజయనగరం కస్పా హైస్కూల్, నాల్గవ స్థానం ఆరికతోట, ఐదో స్థానం సిరిపురం జెడ్‌పి హైస్కూలుకు ఇచ్చారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ప్రతి ఒకరూ లక్ష్యం పెట్టుకొని ముందుకెళ్లినపుడే విజయాలను సాధించగలరని 42 డివిజన్ కార్పొరేటర్ పిన్నింటి కళావతి అన్నారు. . క్రీడా దినోత్సవాన్నిపురస్కరించుకొని ఈ నెల 19 నుంచి 26వ తేది వరకు శ్రీలంకలోని రాజపక్షే స్టేడియంలో నిర్వహించిన అంతర్జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో పోల్ వాల్ట్ విభాగంలో ద్వితీయ స్థానం సాధించిన ఎ.ఆర్. కానిస్టేబుల్ పున్నపురెడ్డి సన్యాసినాయుడుకి దండుమారమ్మ కాలనీవాసులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పిన్నింటి సూర్యనారాయణ దంప తులు మాట్లాడుతూ చిన్ననాటి నుంచి పట్టుదలతో అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన నాయుడు పలువురికి ఆదర్శంగా నిలిచారన్నారు. యువత ఆయనను స్ఫూర్తిగా తీసుకొని ముందుకెళ్లాలన్నారు.

ఘనంగా అక్కినేని జన్మదిన వేడుకలు

విజయనగరం టౌన్ : అక్కినేని నాగార్జున జన్మదిన వేడుకలు స్థానిక ఎన్‌సిఎస్ థియేటర్లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా 'మన్మధుడు' సినిమా రీ రిలీజ్ చేశారు. అక్కినేని అభిమానులు ముందుగా థియేటర్ మేనేజర్ శ్రీనివాస్‌తో కేకు కటింగ్ చేయించి థియేటర్ స్టాఫ్‌కు మిఠాయిలు పంచి పెట్టారు. తర్వాత అక్కినేని అభిమానులు థియేటర్ లో ఉన్న 566 మంది ప్రేక్షకులకు లడ్డూ, జిలాబి పంపిణీ చేశారు. అక్కినేని అభిమానులు కంటుభుక్త దుర్గాప్రసాద్, కట్టమూరి సుబ్రహ్మణ్యం, ధారవెంకట్, నాగేష్, కృష్ణ,, కిరణ్, వివేక్, శ్రీనివాస్ బ్యాంక్, జగదీశ్, తదితరులు పాల్గొన్నారు.


మహాశక్తి పథక హామీలపై ఇంటింటి ప్రచారం

విజయనగరం కోట : టిడిపి అధ్యక్షులు చంద్రబాబునాయుడు మహిళల కోసం ప్రకటించిన 'మహాశక్తి' పథకం హామీలపై తెలుగు మహిళా నాయకులు ప్రసాదుల కనక మహాలక్ష్మి ఆధ్వర్యాన మంగళవారం ఇంటింటి ప్రచారం చేశారు. రింగురోడ్డు రామకృష్ణా నగర్‌లో ఇంటింటికీ వెళ్లి మహిళలతో మాట్లాడారు. టిడిపి అధికారంలోకి వస్తే మహిళలకు ఎంతో భవిష్యత్తు ఉంటుందని తెలిపారు.

'జగనన్నకు చెబుదాం' ఫిర్యాదుల పరిష్కారంలో

జిల్లా పోలీసుశాఖ ప్రథమ స్థానం

ప్రజాశక్తి-విజయనగరం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి ఎం.దీపిక

జగనన్నకు చెబుదాం ఫిర్యాదుల పరిష్కారంలో జిల్లా పోలీసుశాఖ ప్రథమ స్థానంలో నిలిచిందని ఎస్‌పి ఎం.దీపిక తెలిపారు. బుధవారం జిల్లా పోలీసు అధికారులతో ర్ధ సంవత్సర నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ తీవ్రమైన నేరాలకు సంబంధించి గత అర్ధ సంవత్సరంలో నమోదై, దర్యాప్తు పెండింగు ఉన్న కేసుల్లో దర్యాప్తు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. పోలీసు స్టేషనుకు వచ్చే ఫిర్యాదులను పరిశీలించి, కేసులు నమోదు చెయ్యాలన్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది విధిగా తమ పరిధిలో పాఠశాలలు, కళాశాలలను సందర్శించి, విద్యార్థులకు పోక్సో చట్టంపై అవగాహన కల్పించాలన్నారు. రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకు సైనేజస్ ఏర్పాటు చేయాలని, వాహన తనిఖీలు చేపట్టాలని కోరారు. గంజాయి సేవించే వారిపైన, గంజాయిని విక్రయించే చిన్న వ్యాపారులపైన, గంజాయి అక్రమ రవాణకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరించాలన్నారు.

ప్రతిభ కనబర్చిన అధికారులకు ప్రశంసా పత్రాలు

'జగనన్నకు చెబుదాం' పోర్టల్ కు వచ్చే, ఫిర్యాదులను స్వీకరించి, వాటిని పరిష్కరించుటలో గత మూడునెలలుగా జిల్లా పోలీసుశాఖ రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలవడం పట్ల ఎస్‌పి హర్షం వ్యక్తం చేశారు. ఈ పోర్టల్ పర్యవేక్షణ బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహిస్తున్న డిసిఆర్‌బి ఎస్ఐ జి.బాలకృష్ణను 'బెస్ట్ పెర్ఫార్మర్'గా జిల్లా ఎస్‌పి ఎంపిక చేసి, జ్ఞాపికను బహూకరించారు. అదే విధంగా పోక్సో కేసుల్లో నిందితులకు 20సం. లకు పైబడి శిక్షలు విధించడంలో క్రియాశీలకంగా వ్యవహరించిన స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటరు ఎం.శంకరరావును, హత్య కేసుల్లో నిందితులు శిక్షింపబడడంలో క్రియాశీలకంగా వ్యవహరించిన పబ్లిక్ ప్రాసిక్యూటరు వి. రఘురామ్‌లను ఎస్‌పి అభినందించి ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. సమావేశంలో అదనపు ఎస్‌పి అస్మా ఫర్హీన్, డిఎస్‌పిలు, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

డబ్బులు ఇప్పించి న్యాయం చేయండి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గాడి చినతల్లికి రావాల్సిన డబ్బులు మొత్తం పొదుపు సంఘాల గ్రూపులు నుంచి,బ్యాంక్ నుంచి ఇప్పించి న్యాయం చేయాలని డిఆర్‌డిఎ పీడీని ఐద్వా జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ కోరారు. మంగళవారం డిఆర్‌డిఎ పీడీ చక్రవర్తిని బాధితురాలితో కలిసి కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్తవలస ఎపి జి వి బి బ్యాంక్‌లో ఉన్న రూ.22 లక్షలు, ఎల్ కోట వెలుగు సిసి ఈశ్వరరావు నుంచి 13 లక్షలు, డెంకాడ మండలం రేగ గ్రామానికి చెందిన వాసు దగ్గర రూ.8 లక్షలు, గ్రూపు సంఘం సభ్యులు నుంచి రావాల్సిన డబ్బులు ఇప్పించి న్యాయం చేయాలని కోరారు. ఇది 49 మహిళా గ్రూపుల సమస్య అని, పరిష్కరించి న్యాయం చేయాలని కోరారు.

పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ

ప్రజాశక్తి-విజయనగరం

నగరంలోని టిటిడిసిలో జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులకు, యూత్ హాస్టల్ లో పార్వతీపురం (మన్యం జిల్లా) పంచాయతీ కార్యదర్శులకు జిల్లా స్థాయి రిఫ్రెషర్ శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. జెడ్‌పి సిఇఒ కె.రాజ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పంచాయతీ కార్యదర్శుల పరిపాలన సామర్ధ్యాలను పెంపొందించేందుకు ఈశిక్షణను తలపెట్టిందని అన్నారు. కార్యక్రమంలో శిక్షణ కార్యక్రమాల ఇంచార్జ్ ఎ.దేముడు, పార్వతీపురం మన్యం జిల్లా శిక్షణ కార్యక్రమాల ఇన్‌ఛార్జి ఙ.జయరామలక్ష్మి, మాస్టర్ ట్రైనర్లు వెంకటరమణ , తిరుపతి నాయుడు, తదితరులు పాల్గున్నారు.

సేవలో ఆదర్శంగా ఉండాలి

ప్రజాశక్తి-విజయనగరం కోట

దాతలు సమాజ సేవ చేయడానికి ముందుకు ద్వారా పలువురికి ఆదర్శంగా నిలవాని టిడిపి పోలెట్‌బ్యూరో సభ్యులు పి. అశోక్ గజపతిరాజు అన్నారు. యాడారు. మంగళవారం అశోక్ బంగ్లా టిడిపి కార్యాలయంలో కంటోన్మెంట్ ప్రాంతంలో గల శారదా వెల్ఫేర్ బ్లైండ్ హాస్టల్ విద్యార్థినులకు న్యూట్రిషన్ ఫుడ్ కోసం కెనడాకు చెందిన వంశీ కృష్ణ రూ.13,500ను అశోక్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తెలుగుభాషా దినోత్సవం

ప్రజాశక్తి-బొబ్బిలి
బొబ్బిలిలో తెలుగు భాషా దినోత్సవం ఘనంగా జరిగింది. సంస్థానం స్కూల్, శ్రీవిజిగోపాల మున్సిపల్ పాఠశాల, సురేష్ స్కూల్, ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లో తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. తెలుగు భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. గిడుగు రామ్మూర్తి వేషధారణతో విద్యార్థులు అలరించారు. శ్రీవిజయగోపాల మున్సిపల్ పాఠశాలలో బెస్ట్ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కౌన్సిలర్ సావు శారద నగదు బహుమతులు అందజేశారు. శ్వేతాచలపతి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించి తెలుగు ఉపాధ్యాయులను ప్రిన్సిపల్ ప్రొన్సిస్ జార్జ్, సిబ్బంది సన్మానించారు. శ్రీ కాళిదాసి ఆడిటోరియం వద్ద ఉన్న తెలుగు తల్లి విగ్రహానికి రోటరీ క్లబ్ అధ్యక్షులు జెసిరాజు, కార్యదర్శి శ్రీహరి, రోటరీ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుర్ల: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం తెలుగు వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి జయంతిని ఘనంగా నిర్వహించారు. కళాశాల ఇంచార్జి ప్రిన్సిపల్ ఎన్. రామకృష్ణ, తెలుగు అధ్యాపకులు లింగ రమణ మాట్లాడుతూ తెలుగు వ్యవహారిక భాషను అభివృద్ధి పరచడంలో గిడుగు వెంకట రామమూర్తి కృషి ఎనలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, పిఇ ప్రసాద్, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

డెంకాడ: స్థానిక శాఖా గ్రంథాలయంలో తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా గిడుగు రామమూర్తి పంతులు జయంతి మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఇటీవల మృతి చెందిన గ్రంథాలయ సంస్థ కార్యదర్శి లలిత మరణం పాట్ల సంతాపం తెలిపారు. తెలుగు ఉపాధ్యాయుడు మహంతి శ్రీనివాసరావు మాట్లాడుతూ గిడుగు రామమూర్తి పంతులు తెలుగు భాషకు చేసిన సేవను కొనియాడారు. లైబ్రేరియన్ మహేష్, పాఠకులు రాముసూరి, పైడిరాజు, అనిల్, అప్పల నాయుడు, బంగార్రాజు, రామకృష్ణ పాల్గొన్నారు.


బాడంగి: స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు దత్తి సత్యనారాయణ తెలుగు భాష, క్రీడాదినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా హెచ్ఎం గిడుగు రామమూర్తి చిత్రపటానికి పూలమాలలతో నివాళులు అర్పించారు. పాఠశాలలో విద్యార్థులందరికీ తెలుగు డిపార్ట్మెంట్ హెడ్ ఉత్తరావల్లి రామారావు ఆధ్వర్యంలో వ్యాసరచన, పద్య పఠనం, తెలుగులో అనర్గళంగా మాట్లాడడం, డిబేట్, డ్రాయింగ్ వంటి పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించి సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. వివిధ పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయులు విజయమ్మ, నారెమ్మ ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గరివిడి : తాటిగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా తెలుగు భాషా దినోత్సవం, క్రీడా దినోత్సవాలను మంగళవారం నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి, ధ్యాన్ చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించి వారి సేవలను కొనియాడారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి. మధు సూదన్ ఆధ్వర్యంలో విద్యార్థులు ప్రదర్శించిన వివిధ తెలుగు చార్టులు ప్రదర్శన, క్రీడా ప్రదర్శన ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయులు జి. జ్యోతిశ్రీ, వ్యాయమ ఉపాధ్యాయులు బి. శ్రీకాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

చీపురుపల్లి: చీపురుపల్లి పట్టణం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన జాతీయ క్రీడా దినోత్సవం, తెలుగు భాషా దినోత్సవం కార్యక్రమంలో ఎంపిపి ఇప్పిలి వెంకటనర్సమ్మ, జెడ్పిటిసి వలిరెడ్డి శిరీష, వైసిపి జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, వైస్ ఎంపిపి పతివాడ లక్ష్మీ, సర్పంచ్ మంగళగిరి సుధారాణి, పట్టణ పార్టీ అధ్యక్షులు పతివాడ రాజారావు పాల్గొని ఉపాధ్యాయులను సత్కరించారు.

శృంగవరపుకోట: విద్యార్థులు క్రీడలు, తెలుగుభాష పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. మంగళవారం మండలంలోని ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని ధ్యాన్‌చంద్ చిత్రపటానికి, తెలుగుభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని గిడుగు రాంమూర్తి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఇటీవల పాఠశాలలో నిర్వహించిన క్రీడా పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. రిటైర్డ్ తెలుగు మాస్టారు కె.బాబూరావు గారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సన్యాసయ్య, స్కూల్ కమిటీ చైర్మన్ రమణ, సభ్యులు, ప్రధానోపాధ్యాయులు ఉమామహేశ్వర రావు, మామిడిపల్లి మాజీ సర్పంచ్ రమణ, నాయకులు జోగారావు మాస్టారు, రేవళ్లపాలెం వెంకటరావు, కిట్టు, అశోక్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.


బొబ్బిలి: ఉపాధ్యాయులను సత్కరిస్తున్న శ్వేతాచలపతి ప్రిన్సిపల్ జార్జ్



ఎస్‌కోట: గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ

పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గిడుగు రామమూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని తెలుగు శాఖ ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం తెలుగు భాష దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్. కేశవరావు, డాక్టర్ వి. యస్ కృష్ణ, ఆంగ్ల అధ్యాపకులు డాక్టర్ యస్.వి. రామారావు, వైస్ ప్రిన్సిపాల్ వాసుదేవరావు, అధ్యాపకులు డాక్టర్ స్వామి నాయుడు, డాక్టర్ సుధీర్, పవిత్రన్, ఈశ్వర్, భాస్కరరావు పాల్గొన్నారు.

వంగర: స్థానిక శాఖ గ్రంథాలయంలో గిడుగు వెంకట రామ మూర్తి 160 జయంతి వేడుకలు గ్రంథాలయ అధికారి బివి రమణమూర్తి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా గిడుగు వెంకట రామ మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

రామభద్రపురం: తెలుగు భాషా పరిరక్షణే అందరి ధ్యేయం కావాలని రోటరీ క్లబ్ అధ్యక్షులు జెసి రాజు తెలిపారు. మంగళవారం నాయుడువలస పాఠశాలలో ఘనంగా భాషా దినోత్సవం నిర్వహించారు. అనంతరం గిడుగు రామమూర్తి పంతులు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు రెడ్డి వేణు, రాజ శేఖర్, కృష్ణం నాయుడు పాల్గొన్నారు.

లక్కవరపుకోట: మండలంలోని జమ్మాదేవిపేట గ్రామ పంచాయతీ సమీపంలో ఉన్న మహాత్మా గాంధీ జ్యోతిరావు పూలే బిసి బాలికల గురుకుల పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవాన్ని మంగళవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఆ పాఠశాల ప్రిన్సిపల్ విజయ కుమారి పాత్రో ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థులు సిహెచ్. శ్రీజ, జి సాహితీ ధరించిన భరతమాత, గిడుగు రామమూర్తి వేషధారణ అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రిన్సిపాల్ ఇంద్రజ, ఆ పాఠశాల అధ్యాపకులు సుగుణ, యశోద, భార్గవి, విద్యార్థులు పాల్గొన్నారు.


ఎల్.కోట: గిడుగు రామ్మూర్తి, భరతమాత వేశధారణలో పిల్లలు


విజయనగరం టౌన్: తెలుగు భాషా దినోత్సవాన్ని మంగళవారం గురజాడ పాఠశాలలో కరస్పాండెంట్ ఎం.స్వరూప, ప్రధానోపాధ్యాయులు పూడి శేఖర్, పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. తెలుగు ఉపాధ్యాయులు భాస్కరరావు, రామకృష్ణ తెలుగు భాషా గొప్పతనాన్ని విద్యార్థు లందరికీ వివరించారు. అలాగే జాతీయ క్రీడా దినోత్సవాన్ని కూడా ఘనంగా నిర్వహించారు.

ఫోర్టు సిటీ పాఠశాలలో..
తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా జరిపారు. ఈనెల 23 నుంచి 29 వరకు తెలుగు భాషా వారోత్సవాలు జరిగాయి. విద్యార్థులకు పద్యపఠనం, కథలు-కవితలు, సామెతలు, వక్తృత్వం, క్విజ్, పాటలు తదితర అంశాల్లో పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. గిడుగు వెంకట రామమూర్తి జయంతి సందర్భంగా 'హెచ్ వీసమారా ధనమ్' వారు వివిధ పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన క్విజ్ పోటీలో ఫోర్టుసిటీ విద్యార్థులు ప్రతిభ కనబరిచి ప్రథమ, ద్వితీయ స్థానాల్లో బహుమతులు పొందారు. ధ్యాన్ చంద్ జన్మదినమైన జాతీయ క్రీడాదినోత్సవంలో భాగంగా విద్యార్థులకు వివిధ క్రీడాపోటీలు నిర్వహించి బహుమతు లను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ కెవిఆర్‌ఎస్ (శివ), వైస్ చైర్మన్ చంటి, ప్రిన్సిపాల్ లీలామోహన్, డైరెక్టర్లు మధు, అశోక్, నీలిమ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తెలుగు భాషను పరిరక్షించుకోవాలి
విజయనగరం కోట : తెలుగు భాషను పరిరక్షించుకోవలసిన అవసరం ఎంతో ఉందని గాజులరేగ నారాయణ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ మొయిద నారాయణరావు అన్నారు. పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి పంతులు ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలు అలంకరించి నివాళు లు అర్పించారు ఈ సందర్భంగా పిల్లలచే వారి పలకల పైన గిడుగు తెలుగు వెలుగు పిడుగు అనే అక్షర రూపంలో రాసి ప్రదర్శించారు.


వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఘనంగా మాతృ భాష దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా వన్ టౌన్ సిఐ బి.వెంకటరావు మాట్లాడుతూ – గ్రాంథిక భాషలో ఉన్న తెలుగు వచనాన్ని ప్రజల వాడుక భాషలోకి గిడుగు వెంకట రామమూర్తి తీసుకు వచ్చి, నిత్య వ్యవహారంలోకి భాషలో ఉన్న అందాన్ని, విలువను తెలియజెప్పిన మహనీయుడని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు వి.అశోక్ కుమార్, ఎస్.భాస్కర రావు, గణేష్, పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.ముందుగా తెలుగు తల్లి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

శ్రీచైతన్య పాఠశాలలో..
శ్రీ చైతన్య రింగ్ రోడ్ బ్రాంచ్‌లో జరిగిన తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రముఖ కథా రచయిత వి. వెంకట్రావు పాల్గొని గిడుగు రామ్మూర్తి గురించి వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రాంతీయ పర్యవేక్షకులు వి. శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్ బాబు, డీన్లు పాల్గొని విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయులు పాఠశాల పీఠాధిపతులు, కె. సత్యనారాయణ, ఏ. అప్పలనాయుడు, సూర్య చంద్ర, సాయి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.


విజయనగరం: గాజులరేగ నారాయణ పాఠశాలలో విద్యార్థుల ప్రదర్శన

ఎదుగుదలకు చదువే ప్రామాణికం

వేపాడ : విద్యార్థుల ఎదుగుదలకు చదువే ప్రామాణికమని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు భాష దినోత్సవం, గిడుగు రామ్మూర్తి జన్మదిన సందర్భంగా విద్యార్థులకు అందుబాటులో ఉండే విధంగా తమ సొంత నిధులతో గ్రంథాలయాన్ని తన చేతుల మీదుగా మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన విద్యార్థుల సాంస్కృతి కార్యక్రమాలు, చిత్రాలను తిలకించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు వాలీబాల్ ఆడుకోవడానికి అవసరమైన నెట్, బాలు కావాలని కోరగా తన సోదరుడు గొంప వెంకటరావు వారం రోజుల్లో మీకు తెచ్చి అందజేస్తాడని కృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గుమ్మడి భారతి, సేనాపతి గణేష్, ఎల్ రవి ప్రసాద్, కృష్ణవేణి, పాల్గొన్నారు.


గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న గొంప కృష్ణ

సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గిడుగు రామ్మూర్తి జయంతి సందర్భంగా ప్రధానోపాధ్యాయులు బిపిఎ రాజు ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. ఎపి ఆదర్శ పాఠశాల, ఎన్‌కెఆర్ పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

లేగ దూడల ప్రదర్శన పోటీలు

నెల్లిమర్ల: మండలంలోని సతివాడలో మంగళవారం లేగ దూడల ప్రదర్శన పోటీలు నిర్వహించారు. పశుగణాభివృద్ధి సంస్థ, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో లేగ దూడల ప్రదర్శన పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా పోటీల్లో 38మంది పాడి రైతులు సంవత్సరం లోపు వయసున్న 46 లేగ దూడలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్య నిర్వహణాధికారి ఎన్.దామోదరరావు మాట్లాడుతూ జాతీయ కృత్రిమ గర్భధారణ కార్యక్రమంలో భాగంగా లేగ దూడల ప్రదర్శన జరిగిందన్నారు. మేలు జాతి ఆడ దూడల పుట్టుకకు లింగ నిర్ధారిత వీర్యాన్ని పాడి రైతులకు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. పాడి రైతులు ఎదకు వచ్చే పశువులకు ఇంజక్షన్ వేయించుకుంటే మేలు జాతి ఆడ దూడలు పుట్టి రైతులకు మేలు జరుగుతుందని తెలిపారు. కాగా మేలు జాతి ఆడ దూడల ఉత్పత్తికి కృత్రిమ గర్భధారణ ఉపయోగ పడుతుందన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించినవాటికి బహుమతులు, మిగతా రైతులకు సర్పంచ్ రేవల్ల శ్రీనివాసరావు, ఎంపిటిసి రెడ్డి సత్య నారాయణ చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారి డాక్టర్ శ్రీలక్ష్మీ, సతివాడ, రామతీర్థం పశు వైద్యాధికారులు, పశు సంవర్ధక సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

నిబంధనలను ఉల్లంఘించి ఇసుక తవ్వకాలు

బొండపల్లి: నిబంధనలను ఉల్లంఘించి ఇసుక తవ్వకాలు తవ్వి పర్యావరణ నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారని టిడిపి నాయకులు ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం మండల టిడిపి అధ్యక్షులు కోరాడ కృష్ణ, మాజీ జెడ్పిటిసి బండారు బాలాజీ ఆధ్వర్యంలో పలువురు టిడిపి నాయకులు స్థానిక తహశీల్దార్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ చప్ప సత్యనారాయణకు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా కృష్ణ, బాలాజీ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల పేరిట వాగులు, వంకల నుంచి ఇసుక తవ్వేస్తున్నారని, రీచ్‌లలో తవ్వకాలు మొదలుకుని స్టాక్ పాయింట్లకు తరలించి విక్రయాలు చేసి ప్రభుత్వ ధనాన్ని దోచుకుంటున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తాడ్డి అప్పలనాయుడు, పిఎసియస్ మాజీ అధ్యక్షుడు శిడగం శ్రీనువాసరావు, మాజీ ఎంపిటిసి పత్తిగుల్ల రాజినాయుడు, పట్నాన శ్రీనువాసరావు, పత్సమట్ల కృష్ణమూర్తి రాజు, కొండపల్లి సురేష్ బాబు, పత్సమట్ల వర్మ రాజు, వెన్ను రామునాయుడు, బొడ్డు ఉమామహేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

కర్రోతుకు దళిత నాయకుల సత్కారం

నెల్లిమర్ల: టిడిపి నియోజకవర్గం ఇంచార్జ్ కర్రోతు బంగార్రాజుని నియోజకవర్గం దళిత నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి దుశ్శాలువాతో మంగళవారం తన స్వగృహం పోలిపల్లిలో సత్కరించారు. టిడిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పోతల రాజప్పన్న ఆధ్వర్యంలో నియోజక వర్గం దళిత నాయకులు సత్కరించారు. ఈ సందర్భంగా కర్రోతు మాట్లాడుతూ నియోజకవర్గంలో ఉన్న ఎస్‌సి మండల కమిటీలు, గ్రామ కమిటీలను త్వరితగతను పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్రిస్టియన్ కమిటీ కార్యదర్శి చీకటి సుహాసిని, విజయనగరం పార్లమెంటరీ పార్టీ ఉపాధ్యక్షుడు కనిగిరి శ్రీనివాసరావు, నెల్లిమర్ల నియోజక వర్గ అధ్యక్షుడు గంధవరపు హరిబాబు, దన్నాన గోవింద, మాత గోపి, రొయ్యి కనకరాజు, సామాదుల వెంకటరమణ, బగ్గ రామరావు, పల్ల రాంబాబు, దేబార్కి దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పంటల యాజమాన్యంపై శిక్షణ

నెల్లిమర్ల: మండలంలోని తంగుడుబిల్లిలో మంగళవారం రైతులకు పంటల యాజమాన్యంపై శిక్షణ కల్పించారు. ఆత్మ సౌజన్యంతో వరి పంటలో సమగ్ర పంటలు యాజమాన్యంపై ఎఒ ఎం పూర్ణిమ శిక్షణ కల్పించారు. ఈ సందర్భంగా ఆమె విత్తనం నుంచి విక్రయం వరకు వివరించి సూడోమోనస్‌తో విత్తనశుద్ధి, ఎరువులు యాజమాన్యం, అధికంగా ఎరువులు, పురుగుమందులు వాడడం వల్ల జరిగే అనర్థాలు వివరించారు. సేంద్రీయ వ్యవసాయం వల్ల కలిగే ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం ప్రతీ రైతు తను వేసిన పంటను వచ్చే నెల 15లోపు రైతుభరోసా కేంద్రంలో ఇపంటలో నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ నాగరాజు, విఎఎ శివ, ఐసిఆర్‌పి గ్రాయత్రి, రైతులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

నెల్లిమర్ల: పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని సర్పంచ్ రాయి పైడమ్మ అన్నారు. మంగళ వారం సారిపల్లిలో సర్పంచ్ ఆధ్వర్యంలో దోమల మందు పిచికారీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పైడమ్మ మాట్లాడుతూ వర్షాకాలం కాబట్టి వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో మరుగు నీరు నిల్వ కాకుండా తగు చర్యలు తీసుకొని అంటు వ్యాధులు ప్రబలకుండా చూడాలన్నారు.

సిపిఎం సమరభేరి పోస్టర్ విడుదల

ప్రజాశక్తి- శృంగవరపుకోట
ఈ నెల 30 నుంచి సెప్టెంబర్ 4వ తేదీ వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ నిరుద్యోగం, విద్యుత్తు చార్జీలు అధిక ధరలకు వ్యతిరేకంగా నిర్వహించే సిపిఎం సమరభేరి కార్యక్రమాలలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి మద్దిల రమణ కోరారు. ఈ సందర్భంగా మంగళవారం పట్టణంలోని ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద సమరభేరికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మతోన్మాద బిజెపి ప్రభుత్వం నిరుద్యోగ సమస్యల పరిష్కరించడంలో ధరలను అదుపు చేయడంలో ఘోరంగా విఫలమయ్యిందన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తూ కార్పొరేట్లకు బడా పెట్టుబడిదారులకు లక్షల కోట్ల రూపాయలు రాయితీ లిస్తూ పేద ప్రజలపై పన్నులు భారాన్ని మోపుతోందన్నారు. ఈ విధానాలను జగన్ ప్రభుత్వం వ్యతిరేకించకుండా మోడీకి భజన చేస్తూ ఆ విధానాలనే అత్యుత్సాహంతో అమలు చేస్తున్నారని ఆరోపించారు. సమరభేరి కార్యక్రమాలలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో చెలికాని ముత్యాలు, జి. సత్తిబాబు, డి ఉమామహేశ్వరరావు, కె దేవుళ్ళు, కే వెంకట సత్తి, కనకరాజు, లక్ష్మి పాల్గొన్నారు.

కొత్తవలస: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కొత్తవలస జంక్షన్‌లో సిపిఎం ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా చేపట్టారు. సిపిఎం నాయకులు గాడి అప్పారావు మాట్లాడుతూ ఈనెల 30వ తేదీ నుంచి సెప్టెంబర్ నాలుగో తేదీ వరకు జరిగే సిపిఎం సమరభేరి నిరసన కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వ విధానాల వల్ల, బడుగు, బలహీన ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మరో పక్క నిత్యవసర వస్తువు ధరలు ఆకాశానంటుతున్నాయని చెప్పారు.

రాజాం: సిపిఎం ఆధ్వర్యంలో నేటి నుంచి నాలుగు రోజులు పాటు జరగనున్న సమర భేరీ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని సిపిఎం నాయకులు రామ్మూర్తినాయుడు కోరారు. ఈ మేనకు సమరభేరి పోస్టర్లను మంగళవారం రాజాంలో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు, పాల్గొన్నారు.

బోరుబావి ప్రారంభం

లక్కవరపుకోట: మండలంలోని గొల్జాం గ్రామ పంచాయితీలోని ఎంపిపి నిధులతో నిర్మించిన బోరు బావిని పంచాయితీ సర్పంచ్ తూర్పాటి సంతోషమ్మ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలనీ వాసుల దాహార్తిని తీర్చేందుకే కాకుండా కళ్ళాల్లో ఉన్న పశు వులకు ఉపయోగకరంగా ఉంటుందనే ఉద్దేశంతో యర్ర చెరువు సమీపంలో బోరు బావిని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇప్పటికే తమ పంచాయతీలో అభివృద్ధి కార్యక్రమాలతో పాటు సేవాకార్యక్రమాలు చేశామ న్నారు.

ఎస్ఐ, కానిస్టేబుల్‌కు అవార్డులు

రేగిడి: ఒడిశా రాష్ట్రం మాచిపెంట నుంచి అక్రమంగా ఆంధ్రకు గంజాయి తరలిస్తున్న ప్రధాన్ జీనబంద్‌తో పాటు మరి కొంతమందిని ఈనెల 7న అరెస్టు చేసినందుకు ఎస్ఐ శ్రీనివాసరావు, పోలీస్ సిబ్బంది శివలకు ఎస్‌పి దీపిక అవార్డు, ప్రశంసా పత్రాలు మంగళవారం అందజేశారు. ఈనెల 7న ఒడిస్సాలో మాచిపెంట కేంద్రంగా గంజాయి సాగు చేస్తున్న ప్రధాన్ బందును అరెస్ట్ చేసి 11వ తేదీన రిమాండ్‌కు తరలించినందుకు అభినందిస్తూ అవార్డు, ప్రశంస పత్రాలు అంద చేసినట్లు తెలిపారు. అవార్డు రావడం పట్ల రాజాం డిఎస్‌పి, రూరల్ సీఐ ఉపేంద్ర రావు అభినందనలు తెలిపారు.


నాయకులతో మాట్లాడుతున్న రామకృష్ణంనాయుడు

గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం

రేగిడి: రానున్న 2024 సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి గెలుపే లక్ష్యంగా సంఘటితంగా పనిచేద్దామని మాజీ అధ్యక్షులు, వైస్ ఎంపిపి కిమిడి రామకృష్ణంనాయుడు పిలుపునిచ్చారు. మంగళవారం రేగిడిలో తన స్వగృహంలో వంగర, రేగిడి మండల టిడిపి నాయకులతో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి అరాచక పాలనకు ప్రజలు విసిగిచెందారని అన్నారు. అందుకు అనుగుణంగా టిడిపి బలోపేతానికి అందరం కలిసి కట్టుగా పని చేద్దామన్నారు. టిడిపి గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త సైనికుల్లా పని చేయాలని సూచించారు. ఈయనతో వంగర మాజీ ఎంపిపి పైల వెంకటరమణ, నాయకులు ఉన్నారు.

'ప్రజాశక్తి' ప్రజల పత్రిక

ప్రజాశక్తి- పూసపాటిరేగ
ప్రజాశక్తి ప్రజల పత్రిక అని ఎంపిడిఒ జి.రామారావు అన్నారు. మంగళవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ప్రజాశక్తి 43వ వార్షికోత్సవ ప్రత్యేక సంచికను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ప్రజాశక్తి పత్రిక తన వంతు పాత్ర పోషిస్తుందన్నారు. నిజాలను నిర్భయంగా రాయగలిగే పత్రికల్లో ప్రజాశక్తి ఒకటి అన్నారు. ప్రజాశక్తి లాంటి పత్రికలు నేటి పోటీ ప్రపంచంలో మన్న గలుగుతున్నాయంటే అది ప్రజాశక్తిలో పనిచేస్తున్న సిబ్బంది కమిట్మెంట్ అని చెప్పాలన్నారు. వైసిపి మండల నాయకులు మహంతి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజాశక్తి తనదైన శైలిలో వార్తలు ప్రచురించడంలో దిట్ట అన్నారు. మహంతి జనార్దన్ రావు మాట్లాడుతూ ప్రధాన పత్రికల్లో వస్తున్న వార్తల్లో నిజమెంతో తెలియాలంటే ప్రజాశక్తి లాంటి పేపర్లో వార్తలు తప్పనిసరిగా చూడాలన్నారు. సర్పంచ్ టెంపుల్ సీతారాం మాట్లాడుతూ పేద బడుగు బలహీనవర్గాల పక్షాన నిలబడి ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్న ప్రజాశక్తి లాంటి పేపర్ను ఆదరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ రాజకుమార్, పంచాయతీ అధికారి డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


ప్రజాశక్తి ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న ఎంపిడిఒ, తదితరులు

అవంతిలో మెగా జాబ్‌మేళా

ప్రజాశక్తి- గరివిడి
స్థానిక అవంతీస్ ఇంజనీరింగ్ కాలేజీలో మంగళవారం ఉదయం కాలేజీ, ఎపిఎస్ఎస్‌డిసి సంయుక్తంగా మెగా జాబ్ మేళాను నిర్వహించారు. జెయన్‌టియు ఎగ్జామినేషన్స్ కంట్రోలర్ విఎస్ వకుల్ మాట్లాడుతూ కేవలం ప్రభుత్వ ఉద్యోగాల కోసమే ఎదురు చూడకుండా ప్రైవేట్ కంపెనీలలో కూడా మంచి అవకాశాలు ఉన్నాయని వాటిని నిరుద్యోగ యువత అందిపుచ్చుకోవాలన్నారు. జిల్లా స్కిల్‌డవలప్‌మెంట్ అధికారి డాక్టర్ ఎన్.గోవిందరావు మాట్లాడుతూ ఉపాధి కల్పించేందుకు అన్ని ప్రాంతాలలో జాబ్ మేళాలు నిర్వహిస్తున్నామన్నారు. అవంతి విద్యాసంస్థల డైరెక్టర్ ఎ.చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు నైపుణ్యాభివృద్ధిని మెరుగుపరుచుకున్నప్పుడే ఉద్యోగం సాధించడం సులభతరం అవుతుందని తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వి.జాషువ జయప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు మౌఖిక పరీక్షలను ఎదుర్కొనేటప్పుడు పూర్తిగా సంసిద్ధులై ఉండాలన్నారు. అవంతి గ్రూపు విద్యాసంస్థల విద్యార్థులతో పాటు వివిధ ప్రాంతాల్లో నుండి మొత్తం1800 మంది విద్యార్థులు హాజరయ్యారని వెల్లడించారు. 16 కంపెనీలు నుండి ప్రతినిధులు వచ్చి విద్యార్థులకు రాత పరీక్ష , టెక్నికల్ రౌండ్, బృంద చర్చలు, మౌఖిక పరీక్షలు వంటివి నిర్వహించి 500 మంది విద్యార్థులను ఎంపిక చేశారని తెలిపారు. ఈ జాబ్‌మేళాలో అవంతి విద్యాసంస్థల ప్రతినిధి ముత్తంశెట్టి మహేష్ , ఎపిఎస్ఎస్‌డిసి ప్లేస్మెంట్ అధికారి టి.భాస్కర్, వైస్.ప్రిన్సిపాల్ బి.వెంకటరమణ, ఏఓ జి.అనిల్ కుమార్, కాలేజ్ ప్లేసెమెంట్ అధికారి ఎన్.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

విజిలెన్స్ దాడిలో సిగరెట్లు సీజ్

ప్రజాశక్తి- బొబ్బిలి
పట్టణంలోని విజిలెన్స్ అధికారులు మంగళవారం దాడి చేసి సిగరెట్లను సీజ్ చేశారు. ప్రభుత్వానికి పన్ను కట్టకుండా ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా తెచ్చుకుని వ్యాపారులు అమ్ముతున్నట్లు విజిలెన్స్ అధికారులకు సమాచారం రావడంతో స్థానిక పోలీసులు, రెవెన్యూ అధికారులు సమక్షంలో విజిలెన్స్ సిఐ బి.సింహాచలం, ఎస్ఐ బివి రమణ దాడి చేసి శనపతివీధిలో అక్రమంగా నిల్వ చేసిన రూ.40,760 విలువ గల 1633 ప్యాకెట్లను సీజ్ చేసి కేసు నమోదు చేశారు. ప్రభుత్వానికి పన్ను కట్టకుండా సిగరెట్లు, ఇతర సామగ్రి అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ అధికారులు హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఎస్ఐ రమణ, విఆర్వో జి.సత్యనారాయణ, తూనికలు కొలతలు శాఖాధికారి బలరాం, కృష్ణ పాల్గొన్నారు.

అంబళ్ల సేవలు అద్వితీయం

ప్రజాశక్తి - నెల్లిమర్ల
ఎంఇఒగా విద్యారంగానికి అంబళ్ల కృష్ణారావు అందించిన సేవలు అద్వితీయమని ప్రయివేటు పాఠశాలల యాజమాన్య ప్రతినిధులు కొనియాడారు. బదిలీపై వెళ్లిన కృష్ణారావును స్థానిక ఆదిత్య విద్యాలయంలో మంగళవారం సత్కరించి దుశ్శాలువ కప్పి, పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ప్రైవేటు పాఠశాలల ప్రతినిదులు మాట్లాడుతూ మండలంలో ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడంతో పాటు ప్రయివేటు పాఠశాలలకు అందించిన సహకారాన్ని ఈ సందర్భంగా వారు కొనియాడారు. విద్యారంగానికి ఆయన చేసిన సేవలు ఎనలేనివన్నారు. అనంతరం నూతనంగా వచ్చిన ఎంఇఒ ఈపు విజయ్ కుమార్, యూ సూర్యనారాయణలను ఘనంగా సత్కరించారు. తమ సమస్యల పరిష్కారానికి ఎంఇఒలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అపుస్మ యూనియన్ సెక్రటరీ శ్రీనివాసరావు, రమేష్ తో పాటు వివిధ పాఠశాలల ప్రతినిధులు పాల్గొన్నారు.

యువగళం పాదయాత్రలో సువ్వాడ

ప్రజాశక్తి- నెల్లిమర్ల
టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో మంగళవారం టిడిపి జిల్లా సీనియర్ నాయకులు సువ్వాడ రవి శేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవి శేఖర్ నియోజకవర్గంలో పార్టీ పటిష్టతపై లోకేష్‌తో మాట్లాడి వివరించినట్లు చెప్పారు. నాయకులు, కార్యకర్తలతో కలిసి పార్టీ విజయానికి కృషి చేస్తున్నట్లు వివరించారు.

ఎస్.కోటలో గడపగడపకు..

శృంగవరపుకోట: ప్రతి కుటుంబం సంతోషంగా ఉండటమే జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎస్.కోట -3 గ్రామ సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం ద్వారా వర్తించిన పథకాల ప్రయోజనాలు, ప్రభుత్వ విధానాలు గురించి వివరించారు. యువతకు విద్య ఉపాధి రంగంలో అవకాశాలు రావాలంటే మళ్ళీ జగనన్న అధికారంలోకి రావాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, నియోజకవర్గ పరిశీలకు తైనాల విజయకుమార్, వైస్ ఎంపిపి పినిశెట్టి వెంకటరమణ, జామి మండల కన్వీనర్ గొర్లె రవికుమార్, వేపాడ మండల పార్టీ అధ్యక్షులు ముమ్ములూరు జగన్నాథం, వైసిపి మండల అధ్యక్షుడు మోపాడ కుమార్, స్టేట్ డైరెక్టర్ వాకాడ రాంబాబు, జెసిఎస్ ఇన్చార్జిలు, ఎడ్ల కిషోర్, బోజంకి శ్రీను, ఏఎంసీ డైరెక్టర్ పార్వతి, పోతనపల్లి వెంకటరావు, బుగత వెంకటేశ్వరరావు, ఎంపిటిసిలు కడారి అప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

బొబ్బిలి: గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తమ దృష్టికి వచ్చిన సమస్యలు పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు అన్నారు. మంగళవారం బొబ్బిలి మున్సిపాలిటీ పరిధిలో గల 29వ వార్డులో సుమారు రూ.7.5 లక్షలతో నూతనంగా నిర్మించబోయే సిసి రోడ్డు, డ్రైనేజీ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం వార్డులో పర్యటించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణారావు, వైస్ చైర్మన్ చెలికాని మురళీకృష్ణ, 28వ వార్డు కౌన్సిలర్ పాలవలస ఉమ, పట్టణ జెసిఎస్ కన్వీనర్ రేజేటి ఈశ్వరరావు, వైసిపి నాయకులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

జామి: మండలంలోని అలమండ గ్రామానికి చెందిన శిరికి శ్రీను (55) చెరువులో పడి మృతి చెందారు. కుమారుడు సాయి ఫిర్యాదు మేరకు జామి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసుల వివరాలు ప్రకారం. సోమవారం రాత్రి కల్లానికి వెళ్లి తిరిగి రాలేదని బహిర్భూమికి వెళ్లి ప్రమాదపు శాత్తూ మృతి చెంది ఉంటారని కుటుంబ సభ్యులు తెలిపారు. శ్రీనుకు భార్య భారతితో పాటు కుమారుడు ఉన్నారు. దీనిపై ఎఎస్ఐ నర్సింగరావు కేసు నమోదు చేశారు.

ఆటల్లో మేటిగా నిలవాలి

నెల్లిమర్ల: విద్యార్థులు ఆటలు, చదువుల్లో మేటిగా నిలవాలని విసి ప్రొఫెసర్ పి.కె. మహంతి పిలుపునిచ్చారు. మంగళవారం సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఆటలు ఆడటం వల్ల మానసిక ఒత్తిడి నుంచి బయటపడటానికి అవకాశం ఉంటుందన్నారు. డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్ఎస్ వర్మ మాట్లాడుతూ భారత్ కీర్తి పతాకాన్ని అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టిన హాకీ క్రీడాకారుడు ధ్యాన్ చంద్ లాంటి వారి ప్రేరణతో స్ఫూర్తిని పొందాలన్నారు. అనంతరం వీసీ చేతుల మీదుగా వివిధ పోటీలలో విజేతలకు బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఎసి డీన్ ప్రొఫెసర్ పిఎస్ వి రమణారావు, డీన్ ఎంఎల్ఎన్ ఆచార్యులు, అసోసియేట్ డీన్ డాక్టర్ సన్నీ డియోల్ పాల్గొన్నారు.



ప్రతి అక్షరం - ప్రజల పక్షం

ప్రజాశక్తి

తెలుగు దినపత్రిక

PRAJASAKTI 43 ANNIVERSARY 1981-2023

ప్రత్యేక అనుబంధం

పూసపాటిరేగ మండలం

బుధవారం 30-8-2023 | విజయనగరం జిల్లా | 12 పేజీలు



వనరులు పుష్కలం

అందిపుచ్చుకుంటే అందలం



ఓవైపు విశాలమైన తీర ప్రాంతం... మరోవైపు ప్రకృతిని పరవశింపజేసే పచ్చని కొండలు... ఇంకోవైపు ఆరు వరుసల జాతీయ రహదారి... బహుళ ఉత్పత్తులకు నెలవైన పరిశ్రమలు... వీటి నడుమ ఆధ్యాత్మికతను పెంపొందించే పురాతన దేవాలయాలు... పర్యాటకులను ఆకర్షించే ప్రాంతాలు పూసపాటిరేగ సొంతం. ఇలా అనేక వనరులు ఉన్న ఈ మండలం వాటిని వినియోగించుకుంటే మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంది. పాలకులు ఆ దిశగా దృష్టి పెడితే జిల్లాలోనే అభివృద్ధి పథంలో పూసపాటిరేగ మండలం ముందు వరుసలో ఉంటుందనడంలో సందేహం లేదు.

(వివరాలు 2లో)







ప్రజాశక్తి ప్రధాన కార్యాలయం ప్రారంభోత్సవం సందర్భంగా సిఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహనరెడ్డి, మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి పి.మధు, ప్రజాశక్తి చైర్మన్ వి.కృష్ణయ్య, నాటి ఎడిటర్ ఎం.వి.ఎస్.శర్మ, ఎంఎల్‌సి కె.ఎస్.లక్ష్మణరావు, ప్రజాశక్తి విజయవాడ ఎడిషన్ మేనేజర్ జి.శివరామకృష్ణ, భవనం ఇంజినీరు వి.శ్రీనివాసరావు తదితరులు

ప్రజాశక్తిది ఘనమైన వారసత్వం

ప్రజాశక్తి ప్రధాన కార్యాలయ భవనం ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహనరెడ్డి

ప్రజాశక్తి-విజయవాడ

విజయవాడ సమీపంలోని తాడేపల్లి అమరారెడ్డి కాలనీలో నూతనంగా నిర్మించిన ప్రజాశక్తి ప్రధాన కార్యాలయం 'ప్రజాశక్తి భవనం'ను రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహనరెడ్డి 2020 నవంబరు 6న ప్రారంభించారు. వర్చువల్ విధానంలో ఈ కార్యక్రమం జరిగింది. సిఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి కంప్యూటర్ బటన్ నొక్కగానే, ప్రజాశక్తి భవనం వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకం ఆవిష్కరణ జరిగింది. అనంతరం క్యాంపు కార్యాలయం నుండి ముఖ్యమంత్రి మాట్లాడుతూ ప్రజాశక్తి ఘనమైన వారసత్వాన్ని గుర్తుచేశారు. విలువలకు పట్టం కట్టి, అక్షరాలా వాటిని ఆచరించడమే ప్రజాశక్తి ప్రత్యేకతని కొనియాడారు. నమ్మిన విలువల కోసం జీవితాంతం కృషిచేసిన నేతల దిశానిర్దేశంలో ప్రజాశక్తి ప్రయాణం సాగుతోందన్నారు. అటువంటి పత్రిక సొంత భవనాన్ని ఏర్పాటు చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. యాజమాన్యానికి, సిబ్బందికి హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు. మరింతగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. సిఎం క్యాంపు కార్యాలయం నుండి సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి పి.మధు, రాష్ట్ర మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, ప్రజాశక్తి సాహితీ సంస్థ చైర్మన్ వి కృష్ణయ్య, సంపాదకులు ఎంవిఎస్ శర్మ, ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు, లక్ష్మణరావు, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, ప్రజాశక్తి విజయవాడ ఎడిషన్ మేనేజర్ జి.శివరామకృష్ణ, భవనం ఇంజినీరు వి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రజాశక్తి భవనంలో సంపాదకులు ఎంవిఎస్ శర్మ అధ్యక్షతన సభ జరిగింది. ఈ సభలో బివి రాఘవులు మాట్లాడుతూ ప్రజాశక్తికి పత్రికారంగంలో ఏ పత్రికకూ లేని ప్రత్యేకత వుందన్నారు. ప్రజాశక్తి ప్రజలపక్షాన వుంటూ ప్రజాపక్షపాతిగా ముద్రవేసుకుందన్నారు. అధికారంలో ఎవరున్నా ఎన్ని ఒత్తిళ్లు, నిర్బంధాలు ఎదురైనా ప్రజల పక్షాన ప్రజాగొంతుక వినిపించడంలో ఎన్నడూ రాజీపడలేదన్నారు. ఎమర్జన్సీ నిర్బంధం, ఆర్థిక సంక్షోభాలతో ఇబ్బందులు, కరోనా సంక్షోభ సమయంలో ప్రజాపక్షంగా ఉన్నందునే ప్రజాశక్తి నిలబడగలిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాశక్తి పూర్వ సంపాదకులు వి శ్రీనివాసరావు, చీఫ్ జనరల్ మేనేజర్ వై అచ్యుతరావు, డిప్యూటీ ఎడిటర్ తులసీదాస్, పూర్వ ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ ఎస్ వెంకట్రావు మాట్లాడారు. నవ తెలంగాణ సంపాదకులు ఎస్.వీరయ్య, ప్రజాశక్తి పూర్వ సంపాదకులు తెలకపల్లి రవి, ఎస్.వినయ్‌కుమార్ ఆన్‌లైన్‌లో సందేశాలిచ్చారు. విశాలాంధ్ర సంపాదకులు ముత్యాల ప్రసాద్, ప్రసిద్ధ చరిత్రకారుడు డాక్టర్ వకుళాభరణం రామకృష్ణ, ప్రజాశక్తి పూర్వ సంపాదకులు పాటూరు రామయ్య సందేశాలు పంపారు. ॥ డిప్యూటీ ఎడిటర్ బి.తులసీదాస్ ఆహ్వానం పలకగా, జనరల్ మేనేజర్ హరికిషోర్ వందన సమర్పణ చేశారు. అసిస్టెంట్ ఎడిటర్ కె.గడ్డన్న పాల్గొన్నారు. ◆





విలక్షణ సంపాదకుడు ముట్నూరి

ప్రజాశక్తి-విజయనగరం

కృష్ణాపత్రిక సంపాదకత్వ బాధ్యతలను చిరకాలం నిర్వహించిన ముట్నూరి కృష్ణారావు ఒక విలక్షణమైన సంపాదకుడుగా పేరు ప్రతిష్టలను సంపాదించుకొన్న వ్యక్తి. స్వాతంత్ర్య ఉద్యమకాలంలో ఆయన సంపాదకత్వంలో నిర్వహించబడిన కృష్ణాపత్రిక స్వాతంత్ర్య పిపాసకులను ఎంతగానో ఉత్తేజపరిచేది. ఆ రోజుల్లో స్వాతంత్ర్య ఉద్యమానికి పట్టుగొమ్మగా వ్యవహరించిన ఆంధ్ర పత్రికను మితవాద పత్రికగానూ, కృష్ణా పత్రికను అతివాద పత్రికగానూ చాలామంది భావించేవారు. 20వ శతాబ్దం ప్రారంభంనాటికే స్వేచ్ఛాకాంక్షతో తెలుగు పత్రికలు పరాయి బ్రిటీష్ పాలకుల పట్ల ఏవగింపును కలిగించే ధోరణిలో ఉండేవి.ఆనాడు కృష్ణా, గుంటూరు జిల్లాలు కలిసే ఉండేవి. మచిలీపట్నం ముఖ్య పట్టణంగా ఉండేది. అక్కడినుండి 1902లో కృష్ణాజిల్లా అసోసియేషన్ తరఫున దేశభక్త కొండా వెంకటప్పయ్యగారు కృష్ణా పత్రికను వార పత్రికగా ప్రారంభించారు.వేడినందుకుంటున్న వందేమాతరం ఉద్యమకాలంలో కృష్ణా పత్రిక తెలుగు పాఠకులను తన శక్తివంతమైన వ్యాసాలతోనూ, వ్యాఖ్యలతోనూ ఉత్తేజాన్ని కలిగించేది. ఆ పత్రికలో సహాయ సంపాదకుడుగా ముట్నూరి కృష్ణారావు 1903లో చేరారు. కొండా వెంకటప్పయ్య గారు తన న్యాయవాద వృత్తిని వదులుకొని గుంటూరు వెళ్లిపోవడంతో ఆ పత్రికకు కృష్ణారావుగారు ఎడిటర్‌గా పూర్తి బాధ్యతలను స్వీకరించారు. కృష్ణారావుగారి సంపాదకత్వంలో కృష్ణా పత్రిక ఆనాడు దేశవ్యాప్తంగా ఉన్న అతి గొప్ప పత్రికల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. కలాన్ని ఖడ్గంగా ఝుళి పించుతూ నిద్రా ణమైన మారు మూలగల తెలుగు ప్రజలను కూడా తట్టిలేపిన మహనీయ సంపాదకుడాయన. కృష్ణా పత్రిక ఆ కాలంలో చైతన్యవాహినిగా వెలుగొంది తెలుగు పత్రికారంగంలో విశిష్ట స్థానాన్ని ముట్నూరి కృష్ణారావుగారి నాయకత్వంలో సంపాదించుకోగలిగింది.







మండలాభివృద్ధికి సహకారం

జెడ్‌పిటిసి మహంతి సీతాలక్ష్మి

ప్రజాశక్తి- పూసపాటిరేగ

మండలాభివృద్ధిలో తన వంతు సహకారం అందించేందుకు కృషి చేస్తున్నామని జెడ్‌పిటిసి మహంతి సీతాలక్ష్మి అన్నారు. ప్రజాశక్తి వార్షిక్సోవ ప్రత్యేక సంచికకు ఆమె ఇంటర్వ్యూ ఇచ్చారు. మరిన్ని విషయాలు ఆమె మాటల్లోనే..



జిల్లా పరిషత్ నుండి ఇప్పటికే కోట్లాది రూపాయలు పనులు మంజూరయ్యాయి. రూ. 10 లక్షలతో పతివాడ హైస్కూల్ అభివృద్ధి, రూ.10లక్షలతో ఎరుకొండ కల్వర్టు నిర్మాణం, రూ.5లక్షలతో అగ్రహారం నుండి కొవ్వాడ గ్రావెల్ రోడ్డు, రూ. 5 లక్షలతో కొవ్వాడ నుండి గొల్లపేటకు, రూ.5 లక్షలతో కుమిలి రోడ్డు నుండి తులసిదిబ్బ వరకూ, మరో రూ. 5లక్షలతో పూసపాటిరేగలో ఆర్అండ్‌బి స్థలం ప్రహరీ నిర్మాణం, రూ. 5 లక్షలతో గుంపాం నుండి గోవిందపురం వరకూ రోడ్డు వేసాం. త్వరలో పేరాపురం నుండి కొవ్వాడ మీదుగా చోడమ్మ అగ్రహారం వరకూ తారురోడ్డు నిర్మాణం చేపడతాం. గోవిందపురం నుండి గులివిందలపేటకు రోడ్డు, వెంపడాం నుండి పసుపాం రోడ్డు, వెంపడాం హైస్కూల్ నుండి కొవ్వాడకు రోడ్డు నిర్మాణం చేస్తున్నాం. మండలంలోని అవసరం ఉన్న చోట పనులు చేయనున్నాం. ప్రజా సంక్షేమ పాలన అందిస్తున్న ప్రభుత్వంలో ఉండడం ఆనందంగా ఉంది. ఎక్కడ ఎవరికి ఏ సమస్య ఉన్నా సకాలంలో పరిష్కారం జరుగుతోంది. గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పి.సురేష్ బాబులకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. రానున్న రోజుల్లో ఈ ప్రభుతాన్ని ప్రజలు ఆశీర్వాదించడానికి సిద్ధంగా ఉన్నారు. మండలాభివృద్ధితో పాటు పటిష్టతకు మా పార్టీ వంతు కృషి చేస్తున్నాం. ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంఎల్‌సి సురేష్‌బాబు సహకారంతో మరింత అభివృద్ధి చేస్తాం.



ప్రజా నాయకుడు సిఎం జగన్

వైస్ ఎంపిపి సత్యనారాయణరాజు

ప్రజాశక్తి - పూసపాటిరేగ

ప్రజాదరణ కలిగిన నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి. ఎంత మంది ఎన్ని పన్నాగాలు పన్నినా ప్రజలు ఆయన పక్షాన ఉన్నట్లు కనబడుతుందని వైస్ ఎంపిపి ఎన్.సత్యనారాయణరాజు అన్నారు. . ప్రజాశక్తి 43వ వార్షికోత్సవ ప్రత్యేక సంచికకు ఆయన ఇంటర్వ్యూ ఇచ్చారు. విశేషాలు ఆయన మాటల్లోనే..

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గ్రామాల్లో తిరుగుతుంటే ముఖ్యమంత్రికి ఉన్న ప్రజా బలమేంటో అర్ధమవుతోంది. ప్రజలంతా ఆయన పాలనపై సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఏ ప్రభుత్వంలోనైనా చిన్న చిన్న సమస్యలు ఉంటాయన్నది తెలిసిందే. సాంకేతిక కారణాల వల్ల కొన్ని ఇబ్బందులు ఉన్నా వెంటనే వాలంటీర్ల ద్వారా తెలుసుకొని పరిష్కారం జరుగుతోంది. భూముల సర్వే రైతులకు ఎంతో ఉపయోగంగా ఉంది. అమ్మఒడి, ఇళ్ల పట్టాల పంపిణీ, రైతు భరోసా ఇలా పథకాలన్నీ ఎంతో ఉపయోగంగా ప్రజలు గుర్తించారు. సంక్షేమం అందాలంటే ఈ ముఖ్యమంత్రిని పదికాలాల పాటు ఉండేలా ప్రజలు ఆలోచన చేయాలి. మండలాభివృద్ధిలో వైస్ఎంపిపిగా నావంత కృషి చేస్తున్నాను. ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, మండల పార్టీ కన్వీనర్ పతివాడ అప్పలనాయుడు, ఎంపిపి మహంతి కల్యాణి, జెడ్‌పిటిసి సభ్యులు మహంతి సీతాలక్ష్మి సహకారంతో మండలాన్ని మరింత అభివృద్ధిలో నడిపిస్తున్నాం.

కాలగర్భంలో కోట భోగాపురం

ప్రజాశక్తి - పూసపాటిరేగ

ఒకప్పుడు రాజులు ఏలిన ఊరు.. మహారాణులు నడయాడిన నేల.. రాచరిక వైభోగాలతో విరాజిల్లిన గ్రామం.. కాలంతో పరిగెత్తలేక కాలగర్భంలో కలిసిపోయింది.. చరిత్ర పుటలకు అందని దూరంలో మునిగిపోయింది.. చంపావతి నదీ తీరాన కొలువైన మట్టి కోట వరదల్లో శిథిలమైంది.. అక్కడ పాలించిన రాజవంశాలు తరలిపోయాయి. శతాబ్ధాల చరిత్ర శిథిల సాక్షాలు ఇంకా సజీవంగానే దర్శనమిస్తున్నాయి.. నేటికీ ఈ గ్రామం రెవన్యూలో 200 ఎకరాల భూమి ఉంది.. కాలక్రమేణా ఊరంతా తరలిపోయినా పేరు మాత్రం ఇంకా మిగిలే ఉంది.. అదే కోట భోగాపురం..

జాతీయ రహదారిని ఆనుకొని పూసపాటిరేగ, డెంకాడ, భోగాపురం సరిహద్దులుగా చంపావతి నదీ తీరాన కోట భోగాపురం ఉంది. ఇక్కడ విజయనగర పాలకుల పూర్వీకులు తమ్మిరాజ్‌దేవ్ అనే మహారాజు పాలించినట్లు చరిత్ర చెబుతోంది. కోట లోపల నేలమాలిగలు, నీటి కొలనులు, చుట్టూ పూలతోటలతో గుర్రాలు, పశువులు అధిక సంఖ్యలో కొలువు దీరిన కోట ఇది. శతాబ్ధాల క్రితం చంపావతిలో వచ్చిన భారీ వరదల తాకిడికి ఈ కోట శిథిలమైపోయిందని చెబుతుంటారు. దీంతో తమ్మిరాజ్ దేవ్ ఇక్కడ నుంచి కుమిలి కోటకు తరలిపోయారంటారు. ప్రస్తుతం భోగాపురం మండలంలోని నందిగాం పంచాయితీ పరిధిలో ఉన్న ఈ గ్రామంతా ప్రస్తుతం మట్టి పోగులతో దర్శనమిస్తుంటుంది. ఆ దిబ్బలపై నీలగిరి, సరుగుడుతోపాటు డొంకలతో అడవిని తలపిస్తున్న వృక్షాలతో నిండిపోయి ఉంది.

పేరే తప్ప ఊరు లేదు

పేరు గొప్ప ఊరు దిబ్బ అనే నానుడు ఈ గ్రామానికి సరిగా సరిపోతుందని చెప్పాలి. ఒకప్పుడు గొప్పగా వెలుగొందిన ఈ కోట నేడు మట్టి దిబ్బగా మారిపోయింది. ఈ గ్రామానికి పేరే తప్ప ఒక్క కుటుంబం కూడా నివాసం ఉండడంలేదు. కాలక్రమేనా కోటకు చెందిన భూములన్నీ సమీపంలో ఉన్న కొప్పెర్ల, నడిపల్లి, నాతవలస, సింగవరం గ్రామస్తుల వశమయ్యాయి. ప్రస్తుతం అందులో భూములన్నీ రైతులు పేరిట జిరాయితీలుగా మారిపోయాయి.

సజీవంగా ఉన్న జాడలు

అక్కడ కోట శిథిలమై శతాబ్ధాల క్రితమే రాజులు తరలిపోయారు. ఆనాటి కోటంతా నేలమట్టమైంది. ఆ ప్రాంతమంతా మట్టి దిబ్బలుగా పేరుకుపోయింది. కోట సమీపంలో తాగునీటికి ఏర్పాటు చేసికొన్న నీటి కొలనులు బీడుభూములుగా మారిపోయాయి. గుర్రాల, పశువులకు ఏర్పాటు చేసిన నీళ్ల కుండీలు జాడలు నేటికీ కనిపిస్తుంటాయి. అప్పటి రాతి స్తంభా నేటికీ దర్శనమిస్తుంటాయి.

(8వ పేజీ తరువాయి)

మత సామరస్యానికి ఇచ్చిన ప్రాధాన్యతేంటో మనకు అర్థమవుతుంది. విజయనగర గజపతులు మత సామరస్యాన్ని ఇప్పటికి కొనసాగిస్తున్నారంటే అది వారి పూర్వీకుల నుండి పునికి పుచ్చుకున్నదనే తెలుస్తుంది. ఇంత చరిత్ర ఉన్న ఈ కుమిలి గ్రామం జిల్లాలో చారిత్రక ప్రాధాన్యత గల గ్రామాల్లో ముందు వరసలో ఉంచాల్సిందే. ఈ ప్రాంతంలో ప్రజలంతా కుమిలి సంస్థానీసులకు కప్పం చెల్లించేవారు. కొంతకాలం తరువాత అన్నమరాజుకు పసుపు కుంకమ క్రింద ఈ గ్రామాన్ని మహారాజు ఇచ్చివేసినట్లు చరిత్ర పుటలు చెబుతున్నాయి. అన్నమరాజు వంశానికి సంబంధించిన ఆనందరాజు కుమిలి ప్రభువుగా నియమితులయ్యారు. ఆయన గొప్ప యుద్ధ వీరునిగా వెలుగొందినట్లు తెలుస్తుంది. ఈయన బహుల సైన్యాన్ని సమకూర్చుకొని రాజ్య విస్తరణకు పూనుకున్నాడు. 1712లో పది వేల మంది సైనికులతో శ్రీకాకుళం మహమ్మదీ యులు సైన్యాన్ని ఓడించి శత్రు గ్రామాలను వసపరుచుకున్నాడు. 1713లో గాజులరేగ సమీపంలో విజయపురి అనే గ్రామాన్ని నిర్మిం చారు. అక్కడ రాతి కోట నిర్మాణం చేపట్టాడు. కోట నిర్మాణం పూర్తి కాకముందే 1717లో ఆయన మృతిచెందాడు. ఆనందరాజు కుమారుడు పెదవిజయరామ రాజు కుంబిలా పురం (కుమిలి) నుండి రాజధానిని విజయపురికి మార్చాడు. అక్కడ నుండే పాలన సాగించారు. కాలక్రమేన విజయపురి విజయనగరంగా మారింది.

కాలక్రమంలో రాజులు పోయారు...రాజ్యాలు పోయాయి...కానీ వారు నడయాడిన నేలతో పాటు వారు నిర్మించిన కోటలు, పూలతోటలు, మసీదులు అక్కడక్కడా దర్శనమిస్తున్నాయి. విజయనగర సామ్రాజ్య వైభవం ఇక్కడ నుండే ప్రారంభమైందని కుమిలి ప్రజలు గొప్పగా చెప్పుకుని ఆనందం వ్యక్తంచేస్తుంటారు. మిగిలిపోయిన మట్టి కోట ఆనవాళ్లను చూపిస్తూ పూర్వ వైభవం గురించి

నాటి కుంబిలాపురమే నేటి కుమిలి

కుమిలి గ్రామస్తులు గర్వంగా చెబుతారు. తాము ఈ చారిత్రక ప్రాధాన్యత గల గ్రామంలో ఉన్నందుకు సంతోషిస్తున్నామని పిన్నలు, పెద్దలు చెబుతుంటారు. మహారాణుల కోసం ఇక్కడ వేసిన పూల తోటలు నేడు కుమిలి గ్రామస్తులకు జీవనాధారంగా మారిందని అంటున్నారు.



కుమిలి సచివాలయం

పూర్వీకుల కథనం...

క్రీ.శ. 13వ శతాబ్దం నుండి 17వ శతాబ్దం వరకూ కుంబిలాపురంలో పాలన జరిగేదట. ఇక్కడ సుమారుగా 30 ఎకరాల స్థలంలో మట్టి కోట నిర్మాణం చేశారని చెబుతున్నారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో మట్టి కోట కుమిలిపోవడంతో మట్టి దిబ్బలు ఉన్నాయి. మట్టి కోట శిథిలమైపోతున్న సమయంలో రాజు రాజ్య విస్తరణలో భాగంగా కోట మరో ప్రాంతంలో కట్టాలని నిర్ణయించారని కథనం. వీర గడ్డ కోసం వెతుకులాట ప్రారంభమైందట. ఒక రోజున రాజు వేట నిమిత్తం ప్రస్తుతం విజయనగరంలో ఉన్న కోట వైపు కుమిలి కోట నుండి బయలుదేరారు. రాజు గుర్రంపై వెళ్తూ తన వద్ద ఉన్న కుక్కలను ముందుగా వదిలారట. విజయనగరం సమీపంలో కుక్కల ముందు చెమరపిల్లి పరుగులు పెట్టిందట. ప్రస్తుతం విజయనగరం కోట ఉన్న స్థలంలోకి రాగానే వేట కుక్కలపై చెమలపిల్లి తిరగబడిందట. దాంతో రాజు ఆ దృశ్యాన్ని చూసి ఈ స్థలం వీరగెడ్డని గుర్తిం చారట. అందుకే రాతి కోటను అక్కడ నిర్మిం చారట. అప్పటికే కుమిలిలో మట్టితో నిర్మాణం చేసిన కోట కుమిలిపోయే స్థితిలో ఉండడంతో రాతి కోట నిర్మాణం పూర్తయిన వెంటనే కుమిలి నుండి విజయనగరానికి మకాం మార్చారని కతనం ఈ ప్రాంతంలో ఉంది.

ఒకే రకమైన సాదృశ్యం

కుమిలి, విజయనగరానికి నాటికి, నేటికి ఒకే రకమైన సాదృశ్యాలు కనబడతాయి. కుమిలి మట్టి కోట చుట్టూ శత్రువులు కోటలోకి ప్రవేశించకుండా కందకం తవ్వి ఉంది. ప్రస్తుతం విజయనగరం కోట చుట్టూ శత్రువులు కోటను తాకకుండా కందకం తవ్వి ఉంది. కుమిలిలో ఉన్న పెద్ద చెరువు తూర్పు బాగాన మట్టి కోట ఉంది. విజయనగరంలో కూడా పెద్ద చెరువుకు తూర్పు బాగాన కోట నిర్మాణం చేశారు. కుమిలి కోటకు ముందు బాగాన మెట్టపై మసీదు నిర్మించారు. విజయనగరం కోట మందు దర్గా ఉంది. కుమిలిలో ఎన్ని వీదులు పేర్లు ఉన్నాయో విజయనగరంలో కూడా అన్ని వీధులు పేర్లు ఉన్నాయి.


ఊరు పేరు మార్పు కోసం కృషి

మా గ్రామం చారిత్రక ప్రాధాన్యత కలిగి ఉండడం చాలా ఆనందమని గ్రామస్తులు చెబుతున్నారు. మేము ఉన్న ఈ స్థలం ఒకప్పుడు వీరగడ్డని తెలియడంతో మాకు సంతోషంగా ఉంటుందన్నారు.కుంబిలాపురంగా వెలుగొందిన ఈ గ్రామానికి మళ్లీ అదే పేరు పెట్టేలా గ్రామస్తులమంతా కృషి చేయడానికి సిద్ధమవుతున్నామన్నారు. కోట కుమిలి పోవడంతో కుమిలిగా పేరు వచ్చిందని తెలిపారు. ప్రస్తుతం పురాతన దేవాలయం మా గ్రామంలో ఉంది. మా గ్రామాన్ని ప్రస్తుతం ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. ■

నాటి కుంబిలాపురమే నేటి కుమిలి

ప్రజాశక్తి-పూసపాటిరేగ

ఎటు చూసినా కోట... చుట్టూ మోహరించిన సైనికులు...అడుగడుగునా యుద్ధ వీరుల విన్యాసాలు...ఓ పక్క నుండి గుర్రపు డెక్కల చప్పళ్లతో పరుగులు తీసే రథాలు...మరోపక్క నుండి గజరాజుల ఘీంకారాలు...ఇవన్నీ బాహుబలి సినిమాలో రాజమౌళి చూపించిన సీన్లు అనుకుంటే పొరపాటే. మండలంలోని కుమిలి గ్రామంలో పూర్వం జరిగిన యదార్థ గాథ. విజయనగర మహారాజుల సామ్రాజ్యం ఇక్కడ నుండే ప్రారంభమైంది. కుమిలి గ్రామాన్ని రాజధానిగా చేసుకొని ఇక్కడ నుండే పరిపాలన జరిగిందనడానికి సాక్ష్యాలు ఇక్కడ ఇంకా సజీవంగానే ఉన్నాయి. ఈ ప్రాంతంలో మహారాజులు నిర్మించిన మట్టి కోట శిథిలమై మొండి గోడలు దర్శనమిస్తున్నాయి. నేడు కుమిలిగా నామకరణంతో పిలువబడుతున్న ఈ గ్రామం ఒకప్పుడు కుంబిలాపురం అనే నామకరణంతో విరజిల్లేది. కాలక్రమేన ఈ కుంబిలాపురంలో మట్టి కోట కుమిలిపోవడంతో ఈ గ్రామానికి కుమిలి అనే పేరు వచ్చింది. అప్పటి నుండి కుంబిలాపురానికి బదులుగా కుమిలి అనే పేరు మిగిలిపోయింది.


కుమిలిలోని పురాతన ఆలయం

నేడు కుమిలిగా పిలువబడుతున్న ఈ గ్రామం ఒకప్పుడు కుంబిలాపురంగా వెలుగొందింది. మన విజయనగర గజపతుల పూర్వీకుల నివాసానికి ఆశ్రయమైంది. ఈ గ్రామంలో ఉత్తరాన ఉన్న పెద్ద చెరువు సమీపంలో విజయనగరం గజపతుల పూర్వీకులైన పెదజగన్నాదరాజు తనయుడు కృష్ణమరాజు పరిపాలనా సౌలభ్యం కోసం కుమిలిలో మట్టి కోటను నిర్మాణం చేయించినట్లు చరిత్ర చెబుతుంది.

కళింగ రాజ్యంలో అంతర్భాగంగా ఉండే కుమిలి కోటనే రాజధానిగా చేసుకొని ప్రజాపరిపాలనా కార్యకలాపాలు సాగించేవారు. ఈ కుంబిలాపురం సాంస్కృతిక, సాహిత్య, కళారంగాలకు వేదికగా బాసిల్లింది. మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిందనడానికి కారణం ఈ గ్రామంలో ఉన్న మసీదులే. మహారాజులు పాలనలో ఈ ప్రాంతంలో ముస్లిములు అధిక సంఖ్యలో ఉండేవారని ఇక్కడ వృద్ధులు చెబుతున్నారు. ఈ కుంబిలాపురంలో ముస్లిమ్‌ల కోసం ఉర్దూ పాఠశాల ఉండేదంటే మహారాజుల పాలనలో (మిగతా 9వ పేజీలో)

గడపగడపకూ సంక్షేమ ఫలాలు

వైస్ ఎంపిపి అల్లాడ రమేష్



ప్రజాశక్తి - పూసపాటిరేగ

గడప గడపకూ జగనన్న సంక్షేమ ఫలాలు అందుతున్నాయని, ప్రజలకు ఇచ్చిన మాటను నెరవేర్చిన నాయకుడుగా సిఎం జగన్మోహన్‌రెడ్డి ప్రజానాయకుడయ్యాడని వైస్ ఎంపిపి అల్లాడ రమేష్ అన్నారు. ప్రజాశక్తి 43వ వార్షికోత్సవ ప్రత్యేక సంచికకు ఇంటర్వ్యూ ఇచ్చారు. విశేషాలు ఆయన మాటల్లోనే..

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలనపట్ల. ప్రజలంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పేదలందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయి. అయితే సాంకేతిక సమస్యలు వల్ల కొన్ని సమస్యలు ఉండడం సహజం. అందుకే ప్రతి గడపకు వెళ్లి వారి సమస్యను, వారికి వస్తున్న సంక్షేమాన్ని అడిగి తెలుసుకుంటున్నాం. సంక్షేమ పథకాల పట్ల ప్రజలు ఆకర్షితులై అనేక మంది పార్టీలో చేరుతున్నారు. మరోసారి జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం అత్యధిక మెజార్టీతో రానుంది. గ్రామాల్లో వైసిపి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో బ్రహ్మారథం పడుతున్నారు. ఒక్కొక్క కుటుం బానికి లక్షలాది రూపాయలు సంక్షేమ పథకాల ద్వారా అందుతున్న విషయం తెలిసిందే. ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పల నాయుడు, మండల పార్టీ కన్వీనర్ పతివాడ అప్పలనాయుడు, ఎంపిపి మహంతి కల్యాణి, జెడ్‌పిటిసి మహంతి సీతాలక్ష్మి సహ కారంతో మండలం మరింత అవృవృద్ధి పథంలో నడుస్తుంది.

ఇంటింటికీ సంక్షేమ ఫలాలు

వైసిపి మండల అధ్యక్షులు పతివాడ అప్పలనాయుడు

ప్రజాశక్తి-పూసపాటిరేగ



నవరత్నాలతో సామాన్య, మధ్య తరగతి, పేద, బడుగు, బలహీన వర్గాల్లో ఆనందం వ్యక్తమవుతోందని వైసిపి మండల అధ్యక్షులు పతివాడ అప్పలనాయుడు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యాక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్తుంటే పేదల కళ్లలో సంతోషం చూస్తున్నామని అన్నారు. ప్రజాశక్తి 43వ వార్షికోత్సవం సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. మరిన్ని విషయాలు ఆయన మాటల్లోనే... గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా వచ్చిన వినతులన్నింటిపై దృష్టి పెట్టి పరిష్కరిస్తున్నాం. ఇలాంటి సిఎంను మునుపెన్నడూ చూడలేదు. పాదయాత్రలో ఇచ్చిన ప్రతి మాటకు కట్టుబడి పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రిని ఇప్పుడే చూస్తున్నాం. మాట తప్పని.. మడం తిప్పని ఇటువంటి ముఖ్యమంత్రి పాలనలో పార్టీ కన్వీనర్‌గా ఉండడం నా అదృష్టం. ఈ నాలుగేళ్ల పాలన ప్రజా రంజకంగా సాగింది. రైతు భరోసా, అమ్మఒడి, కాపునేస్తం, పేదలకు ఇళ్ల స్థలాలు, ఇలా చెప్పలేనన్ని పథకాలు ప్రజలకు సహకారంగా మారాయి. నవరత్నాలతో పాటు అనేక సంక్షేమ పథకాలను ఇస్తున్న ఇలాంటి ప్రభుత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనువాసరావు, ఎంఎల్‌సి డాక్టర్ సురేష్ బాబు సహకారంతో ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం.

టిడిపికి పూర్వ వైభవం

టిడిపి మండల అధ్యక్షులు మహంతి శంకరరావు

ప్రజాశక్తి-పూసపాటిరేగ



గ్రామాల్లో టిడిపి పట్ల ప్రజలు చూపిస్తున్న ఆదరణ చూస్తుంటే టిడిపికి పూర్వ వైభవం వచ్చినట్టేనని ఆపార్టీ మండల అధ్యక్షులు మహంతి శంకర్రావు అన్నారు. ప్రజాశక్తి వార్షికోత్సవం సందర్భంగా ఆయన ఇంటర్వ్యూ ఇచ్చారు. విశేషాలు ఆయన మాటల్లోనే...కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై వేస్తున్న భారాలను నిరసిస్తూ టిడిపి అదినేత చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు బాదుడే బాదుడు కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లోకి వెళ్తే ప్రజలు బ్రహ్మరథం పట్టారన్నారు. యువగళం పేరుతో లోకేష్‌బాబు చేస్తున్న యాత్రకి వస్తున్న స్పందన అందరం చూస్తున్నాం. ఈ ప్రభుత్వాన్ని బంగాళాఖాతంలో కలిపియేడానికి ప్రజలు సిద్దంగా ఉన్నారు. నిత్యావసర వస్తువుల ధరల పెంపుతో పేద, మద్యతరగతి ప్రజల నుంచి ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తి కనిపిస్తుంది. ఒక్కచాన్స్ ఇవ్వడం వల్ల ఇన్ని ఇబ్బందులు పడుతున్నామని ప్రజలే చెబుతున్నారు. ఏ పార్టీ అయినా వ్యవస్థలను నిర్వీర్యం చేస్తుంటే ఆ ప్రభుత్వాలకు బుద్ధి చెప్పేందుకు మేధావులు, విద్యావంతులు సిద్ధమవ్వాలి. ఇలాంటి ప్రభుత్వాన్ని మా రాజకీయ జీవితంలో ఎన్నడూ చూడలేదు. ఈ ప్రభుత్వం, ఈ పాలకులపై వ్యతిరేకత ప్రజల్లో కనిపిస్తుంది. గ్రామాల్లో తిరుగుతూ భూత్ కమిటీలు, క్లస్టర్ కమిటీలు, గ్రామ కమిటీలు వేసి పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నాం. రానున్న రోజుల్లో టిడిపిదే అధికారం. అధినేత చంద్రబాబుతో పాటు జిల్లా, నియోజవర్గ నాయకులు ఆదేశాల మేరకు పార్టీ పటిష్టతకు కృషి చేస్తున్నాం.

ఇది ప్రజావ్యతిరేక పాలన

మాజీ మంత్రి పతివాడ నారాయణ స్వామినాయుడు

ప్రజాశక్తి - పూసపాటిరేగ

ఒక్క ఛాన్సు అంటూ ప్రజలను మోసం చేసి గద్దెనెక్కిన ఈ ముఖ్యమంత్రికి త్వరలోనే ప్రజలు బుద్ధి చెబుతారని టిడిపి మాజీ మంత్రి పతివాడ నారాయణస్వామి నాయుడు అన్నారు. ఇది ప్రజా వ్యతిరేక పాలనంటూ మండిపడ్డారు. ప్రజాశక్తి 43వ వార్షికోత్సవం సందర్భంగా ఆయన ఇంటర్వ్యూ ఇచ్చారు. విశేషాలు ఆయన మాటల్లోనే...

వైసిపి ప్రభుత్వం నవ రత్నాల పేరుతో ప్రజలను మోసం చేస్తోంది. చెప్పింది ఒకటి చేసేది ఒకటి. రూ.3వేలు పింఛన్లు ఇస్తానని చెప్పి మాట తప్పారు ముఖ్యమంత్రి. కొంతమంది అర్హులకు పింఛన్ల పలుచోట్ల కోత పడింది. బడికి వెళ్లిన పిల్లలకు అమ్మఒడి ఇస్తానని చెప్పి ఇంట్లో ఒక్క పిల్లాడికే ఇస్తున్నాడు. అది కూడ ఏటా విద్యార్థుల సంఖ్యను కుదిస్తున్నారు. సాంకేతిక సమస్యలంటూ అనేక మందిని అనర్హులుగా చేస్తున్నారు. పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీ పేరుతో భారీ దోపిడీకి తెరలేపారు. ప్రభుత్వ భూములను ఆక్రమించి అమ్ముకొని సొమ్ము చేసుకున్నారు. అంతేకాక ప్రజలు నివాసానికి యోగ్యంలేని చోట్ల ఇళ్ల స్థలాలు కేటాయించడంతో నిర్మాణాలకు ఎవరూ ముందుకు రావడంలేదు. భోగాపురం ఎయిర్‌పోర్డులో ఈ పాలకులు రైతులను నిలువునా ముంచేసారు. పాలకులే బ్రోకర్లుగా మారి రైతుల సొమ్మును కొల్లగొట్టారు. శంకుస్థాపన చేసినప్పటికీ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఇలాంటి పాలకులు ప్రజలకు ఏం మేలు చేస్తారు? అభివృద్ధి గురించి వీరికి పట్టడం లేదు. ఈ పరిణామాలను ప్రజలంతా గమనిస్తున్నారు. ఈ నాలుగేళ్లలో చేసిన అభివృద్ధి లేదు. అసలు ముఖ్యమంత్రి ప్రజల్లోకి రావడం లేదు. ప్రజలపై అనేక రకాలుగా భారాలు వేస్తున్నారు. పాఠశాలలను కుదించడంతో దూర ప్రాంతాల పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. కనీసం తారక రామతీర్థ సాగర్ పూర్తి చేస్తారని రైతులు ఆశపడ్డారు.



రామతీర్థ సాగర్ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుంది.

జనంలోకి జనసేన కార్యక్రమాలు



జనసేన పూసపాటిరేగ మండల అధ్యక్షులు జలపారి అప్పడుదొర

ప్రజాశక్తి- పూసపాటిరేగ

జనంలోకి జనసేన కార్యక్రమాలంటూ ప్రజల్లోకి జనసేన చేయబోయే కార్యక్రమాలును వివరిస్తున్నాం. ఇప్పటికే పూర్తి స్దాయిలో జనసేన పార్టీపై ప్రజల్లో అవగాహన ఉంది. మండలంలోని మెజార్టీ ఓటర్లు జనసేనకు పట్టం కట్టేందుకు సిద్దంగా ఉన్నారు. సుసంప్పన్నమైన పాలన చూసేందుకు పవన్ కల్యాన్‌ను ముఖ్యమంత్రి చేయాలి. మండలంలో విధ్యార్డులకు డిగ్రీ కళాశాల లేదు. పనులు కోసం పొరుగు రాష్ట్రాలకు పోతున్నారు అని జనసేన మండల అధ్యక్షులు జలపారి అప్పడదొర అన్నారు. ప్రజాశక్తి 43వ వార్సికోత్సవం సందర్భంగా ఆయన ప్రజాశక్తితో ప్రత్యేకంగా మాట్లాడారు. మరిన్ని విషయాలు ఆయన మాటల్లోనే..

మండల ప్రజలు ఎన్నో సమస్యలతో కొట్టిమిట్టాడుతున్నారు. ప్రమాదం జరిగితే ఆపేందకు అగ్ని మాపక కేంద్రం లేదు. రామతీర్ధ సాగర్ ప్రాజెక్ట్ నిర్మాణంపై దృష్టి సారించడం లేదు. వ్యవసాయం పై ఆదారపడే ఈ నియోజకవర్గంలో మార్కెట్ యార్డులుగాని, పంట కాల్వలకు, సీతల గిడ్డంగిలు ఏర్పాటులో ప్రజా ప్రతినిధులు వైపల్యం కనిపిస్తుంది. దశాభ్దాలుగా నెల్లిమర్ల నియోజకవర్గంలో నెరవేరని సమస్యలు ఎన్నో ఉన్నాయి. ఈ ప్రభుత్వ పాలనలో అభివృద్ధి కుంటుపడిందనడంలో ఎటువంటి సందేహం లేదు. పప్పు, బెల్లాలులా ప్రజలకు డబ్బులు పంచడమే తప్పా వారికి స్థిరమైన భవిష్యత్తును ఇవ్వడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. బావి తరాలకు బాసటగా నిలవాల్సిన ప్రభుత్వమే విచ్చలవిడిగా అప్పులు చేసి తమ స్వార్ధం రాజకీయ ప్రయోజనం కోసం భవిషత్తును తాకట్టు పెడుతుంది. గ్రామాలు అభివృద్ధి చెందడం ద్వారానే ప్రజల మనుగుడ కొనసాగుతొంది.

వైసిపి నాయకులు కూడా బరితెగించేస్తున్నారు. సాదారణ ప్రజలకు రక్షణ కరువైంది. మహిళలు, దలితలు పరిస్థితి ఎలా ఉందో మనం టీవీల్లో చూస్తున్నాం. మండలలోని మత్స్యకార గ్రామాల్లో తాగునీరు అందని ద్రాక్షగా మిగిలింది. ఎన్నికలు వచ్చినప్పుడే పాలకులకు మత్స్యకారులు గుర్తొస్తున్నారు. జగనన్న ఇల్ల స్ధలాలు అంతా భూటకం. ఈ విషయంలో మండలంలోని భారీ అవినీతి జరిగింది. దీనిపై త్వరలో పోరాటం చేస్తాం. జగనన్న కాలనీ పేరిట పేదలకు ఇవ్వకుండా వైసిపి నాయకుల్లో చాలా మంది స్థలాలు తీసుకుని అమ్ముకున్నారన్న విషయం మా దృష్టికి వచ్చింది. దీనిపై పార్టీ తరుపున స్పందించి పోరాటానికి సిద్ధమవుతాం. ఇప్పటికే ఈ విషయంపై పార్టీ పెద్దలతో చర్చించాం. త్వరలో నిర్ణయం తీసుకుంటాం.

అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నాం

పూసపాటిరేగ ఎంపిపి మహంతి కళ్యాణి



ప్రజాశక్తి- పూసపాటిరేగ

వైసిపి ప్రభుత్వ పాలనలో మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలన్న ఉద్దేశం, ప్రణాళికతో పనిచేస్తున్నామని ఎంపిపి మహంతి కళ్యాణి అన్నారు. ప్రజాశక్తి 43వ వార్సికోత్సవం సందర్భంగా ఆమె ప్రజాశక్తితో మాట్లాడారు. మరిన్ని విషయాలు ఆమె మాటల్లోనే..

జిల్లాలోనే ప్రత్యేక మండలంగా పేరొందిన పూసపాటిరేగ అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్నాం. ఎందుకంటే మండల ప్రజలు మాపై నమ్మకంతో మండల అధ్యక్షపీఠం ఇచ్చారు. గత పాలకులకు, మాకు అభివృద్ధిలో తేడా చూపించాల్సిందేనని ముందుకు వెళ్తున్నాం. మండలంలోని తీరప్రాంతంతో పాటు జాతీయ రహదారి విస్తరించి ఉంది. ఇప్పటికే పారిశ్రామిక ప్రాంతంగా రూపుదిద్దుకొంది. ఈ మండలంలో స్థానికుల కంటే ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు సుమారుగా 10 వేల మంది వరకూ ఉంటున్నారు. మండలంలోని ప్రజలందరికీ అవసరమైన తాగునీరు, రోడ్లు, తదితర మౌలిక సదుపాయాల ఏర్పాటుకు కృషి చేస్తున్నాం. పింఛన్లు, ఇళ్ల పట్టాలను ఇంకా రాని అర్హులను గుర్తించి వారికి అందజేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. అన్నింటి కన్నా ముఖ్యంగా తాగునీటికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నాం. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా రూ. 3.67 కోట్లుతో సిసి రోడ్లు, కాలువలు నిర్మాణం చేసాం. జలజీవన్ మిషన్ ద్వారా 28 పంచాయతీలకు రూ. 41.86 కోట్లు, నాడు నేడు ద్వారా 74 పాఠశాలల్లో రూ. 19.32 కోట్లు, పిహెచ్‌సిలో నాడు నేడు ద్వారా రూ. 45 లక్షలతో అభివృద్ధి పనులు, మండలంలోని సుమారుగా రూ. 30 కోట్లుతో సచివాలయం, ఆర్‌బికెలు, వెల్‌నెస్ సెంటర్‌లు నిర్మాణం చేసాం. 18 బల్క్‌మిల్క్ సెంటర్‌లు, రెండు డిజిటల్ లైబ్రరీలు నిర్మాణం చేశాం. మండల పరిషత్ నిధులు రూ. 85 లక్షలతో సిసి రోడ్లు, కాలువలు నిర్మాణం, ఎఐబి గ్రాంటు ద్వారా గ్రావెల్ రోడ్లు, ఎన్‌ఆర్ఇజిఎస్ ద్వారా రూ. 75. 5 లక్షలుతో అభివృద్ధి పనులు చేసాం. రూ. 22 లక్షలతో మల్కాంలో స్లాబ్ కల్వర్ట్ పూర్తయ్యింది. త్వరలో ఎరుకొండ రహదారిపై రూ. 85 లక్షలతో బ్రిడ్జి నిర్మాణం చేయనున్నాం. పూసపాటిరేగ ఆరోగ్య కేంద్రంలో డయాగ్నొస్టిక్ సెంటర్ నిర్మాణం ప్రారంభమైంది. అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలన్నదే మా ధ్యేయం. ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, జిల్లాపరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ సురేష్‌బాబు సహకారంతో మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నాం.

మత్స్యకారుల వెతలు తీరేదెప్పుడో?

ప్రజాశక్తి-పూసపాటిరేగ

ప్రభుత్వాలు, పాలకులు మారినా గంగపుత్రుల బతుకులు మాత్రం మారడం లేదు. సముద్రమే ఆధారంగా బతుకుతున్న మత్స్యకారులకు జీవనోపాధి కరువవుతోంది. ప్రాణాలను ఫణంగా పెట్టి వేటకు వెళ్లినా అందుకు తగ్గ ప్రతిఫలం దక్కడం లేదు. జిల్లాలోని భోగాపురం, పూసపాటిరేగ మండలాల్లో 27 కిలోమీటర్ల మేర విస్తరించి తీరం ఉంది. ఈ తీరం వెంబడి 19 మత్సకార గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల్లో సుమారు 25 వేల మంది జనాభా నివసిస్తున్నారు. వీరిలో సుమారు 10 వేల మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా వేటపై ఆధారపడి జీవిస్తున్నారు.

రసాయనిక వ్యర్థాలను నివారించాలి

పదేళ్లగా తీరం వెంబడి పదుల సంఖ్యలో మైలాన్, హెచ్‌బిఎల్, వేదా, అరబిందో, రెడ్డీస్, ఎఒఎల్, సరాకా తదితర రసాయనిక పరిశ్రమలు వెలిశాయి. వీటి నుండి వస్తున్న వ్యర్థ జలాలన్నీ సముద్రంలోకి పైపు లైన్ల ద్వారా విడుదల చేస్తున్నారు. దాంతో ఈ తీరమంతా వ్యర్థ జలాలతో కాలుష్యమైపోయింది. సుమారుగా తీరానికి 5 కిలోమీటర్లు సముద్రం లోపల వరకూ చేపలు జాడ కానరావడం లేదు. దాంతో వేటకు వెళ్లినప్పటికీ చేపలు వలల్లో పడడం లేదు. అది రానురానూ తీవ్రంగా పరిగణించింది. ప్రస్తుతం సాంప్రదాయంగా వస్తున్న కుల వృత్తిని వదల్లేక, భార్యా, పిల్లలను పోషించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

చేపల గుర్తింపు కేంద్రాన్ని ఏర్పాటుచేయాలి

ఒకప్పుడు వేటకు వెళ్తే వలలు పిగిలేటంత మత్స్య సంపద దొరికేది. కానీ ప్రస్తుతం తీరంలో ఉన్న రసాయనిక పరిశ్రమల వ్యర్థాలతో చేపల వేట కష్టంగా మారింది. పొద్దస్తమానం వేటాడినా పూట గడవడం కష్టంగా మారింది.

తీరంలో డీజిల్ బంక్ ఏర్పాటుచేయాలి

భోగాపురం, పూసపాటిరేగ మండలాల్లో సుమారుగా 442 మర బోట్లు ఉన్నాయి. ఒకొక్కరూ రోజుకు సుమారుగా 10 నుండి 20 లీటర్ల వరకూ డీజిల్ వినియోగిస్తారు. వేట నిమిత్తం వీరంతా రోజుకు సుమారుగా 3 వేల లీటర్లు డీజిల్‌ను వినియోగిస్తారు. తీరంలో డీజిల్ బంకు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఆటోలపై 15 కిలోమీటర్లు దూరంలో ఉన్న బంకులకు వెళ్లి ప్రతిరోజు డీజిల్ తెచ్చుకుంటారు. కొంతమంది గ్రామంలో అమ్ముతున్న కల్తీ డీజిల్‌ను కొనుక్కుంటున్నారు. దాంతో ఇంజన్లు తరుచూ మరమ్మతులకు గురవుతున్నాయి. దళారుల దగ్గర డీజిల్ కొనడంతో బిల్లులు లేక సబ్సిడీకి కూడా దూరమవుతున్నారు. అధికారులు స్పందించి తీరంలో డీజిల్ బంకు ఏర్పాటు చేయాల్సిఉంది.



ఫార్మా పరిశ్రమల నుంచి విడుదల చేస్తున్న వ్యర్థజలాలు

ప్లాట్‌ఫాం వెంటనే అందుబాటులోకి తేవాలి..

కష్టపడి వేటాడి తెచ్చుకున్న మత్స్య సంపద ఆరబెట్టుకోవడానికి ప్లాట్‌ఫాం లేక తీరంలో ఇసుకలో ఆరబెడుతున్నారు. దాంతో చేపలకు ఇసుక అంటుకుని నాణ్యత కోల్పోతున్నాయి. నెత్తళ్లు, రొయ్యలు లాంటి విలువైన మత్స్య సంపద ఆరబెట్టుకోవడానికి ప్లాట్‌ఫాం లేక తడిగానే దళారులకు తక్కువ ధరకు అమ్మి నష్టపోతున్నారు. తీర గ్రామాల్లో వెంటనే ప్లాట్‌ఫాం ఏర్పాటుచేసి మత్స్యకారులను నష్టాల బారి నుండి ఆదుకోవాల్సిఉంది.

దళారులతో తీవ్ర నష్టం

ప్రాణాలకు తెగించి వేటాడి తెచ్చిన వేలాది రూపాయలు మత్స్య సంపద దళారులు పాలవుతుంది. మార్కెట్లో కిలో రూ.200 ఉన్న చేపలు దళారులకు రూ.150కి ఇవ్వాల్సిందే. ఎందుకుంటే దళారులు, మత్స్యకారులకు వేటలేని సమయంలో రూ.10 వేలు నుండి రూ. 20 వేలు దాకా అప్పుగా ఇస్తారు. దానికి బదులుగా వేటాడి తెచ్చిన సరుకును వారికే ఇవ్వాలనే నిబంధన పెడతారు. లేక పోతే కుల కట్టుబాట్ల ప్రకారం జరిమానా విదిస్తారు. దాంతో విలువైన సంపదను తక్కువ ధరకు ఇచ్చి నష్టపోతున్నారు.

ఐస్ పెట్టెలు పంపిణీ చేయాలి

వేటాడి తెచ్చిన మత్స్య సంపదను నిల్వ ఉంచేందుకు ఐస్ బాక్సులు లేకపోవడంతో చేపలు నాణ్యత కోల్పోతున్నాయి. ఐస్ బాక్సులు ఉంటే చేపలు కొన్ని రోజుల వరకూ పాడవకుండా ఉంటాయి. మత్స్య శాఖ పంపిణీ చేస్తున్న ఐస్ బాక్సులు నాణ్యత లేకపోవడంతో చేపలు పాడైపోతున్నాయని మత్స్యకారులు వాపోతున్నారు. వారికి నాణ్యతగల ఐస్ బాక్సులు పంపిణీ చేయాల్సిఉంది.



సముద్రంలో వేటకు వెళ్తున్న మత్స్యకారులు

తుపాను షెల్టర్లు వినియోగంలోకి తేవాలి

ప్రకృతి విపత్తులు సంభవించి నప్పుడు మత్స్యకారులను సురక్షితంగా ఉంచాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం తీర ప్రాంత గ్రామాల్లో తుపాను భవనాల నిర్మాణం చేపట్టింది. రెండు మండలాల్లో సుమారుగా 24 తుపాను భవనాలను నిర్మించారు. కొన్నేళ్లగా పరిరక్షణ లేక కొన్ని శిథిలావస్థలో కొట్టుమిట్టాడగా మరికొన్ని నేలమట్ట మయ్యాయి. అధికారులు స్పందించి తుపాను భవనాలను వినియోగంలోకి తేవాలి.

తాగునీరు పారిశుధ్యంపై దృష్టి పెట్టాలి

మత్స్యకార గ్రామాల్లో ముఖ్యంగా తాగునీరు, పారిశుధ్యంపై దృష్టి పెట్టాల్సి ఉంది. చింతపల్లి, పెద్దూరు, కొత్తూరు, కోనాడ, తిప్పలవలస, ముక్కాం, కొండరాజపాలెం తదితర గ్రామాల్లో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకులకు అరకొర నీరు రావడంతో తాగునీటికి చేతిబోర్లపై ఆధారపడాల్సిన పరిస్థితి. క్లోరినేషన్ లేక తాగునీరు కలుషితం కావడంతో తరచూ మత్స్యకారులు రోగాలు బారిన పడుతున్నారు. గ్రామాల్లో తాగునీటిపై ప్రత్యేక శ్రద్ధ వహించి పారిశుధ్యం మెరుగు పర్చాల్సిఉంది.

మత్స్యకార సొసైటీలను పునరుద్ధరించాలి

నిర్వీర్యమైపోయిన మత్స్యకార సొసైటీలను ప్రభుత్వం పునరిద్ధరించాల్సిఉంది. గతంలో రెండు మండలాల్లో సుమారుగా 7 మత్స్యకార సొసైటీలు ఉండేవి. ప్రస్తుతం అవి మరుగున పడిపోయాయి. మత్స్య శాఖాధికారులు కూడా వాటి పునరుద్ధరణకు చర్యలు తీసుకోపోవడంతో సొసైటీల ద్వారా గంగపుత్రులకు రావాల్సిన రుణాలు రావడం లేదు. ఆ శాఖ అధికారులు స్పందించి సొసైటీలను పునరుద్ధరించాలి.

సంక్షోభంలో ఉప్పు సాగు

జిల్లాలోని పూసపాటిరేగ మండలం కోనాడ తీరంలో బ్రిటిష్ వారు ఏర్పాటుచేసిన ఉప్పు పరిశ్రమ సంక్షోభంలో కొట్టుమిట్టాడు తోంది. ఒకప్పుడు ఉప్పు సాగుతో కళకళలాడిన పంట పొలాలు నేడు బీడు భూములుగా దర్శనమిస్తున్నాయి. అయోడైజ్డ్ ఉప్పునే వాడాలంటూ ప్రభుత్వాలు చేస్తున్న ప్రకటనలు వీరి పాలిట శాపంగా మారాయి. తెల్ల దొరలు తెల్ల బంగారంగా పండించే సాధారణ ఉప్పుకు కాలం చెల్లిపోతుంది. కేంద్ర ప్రభుత్వం సాధారణ ఉప్పుకు చెక్ పెట్టడంతో ఉప్పు గల్లీలు వెలవెలబోతున్నాయి. ప్రధానంగా కూలీల రేట్లు పెరిగి ఉప్పు ధరలు పతనావస్థకు చేరడంతో రైతుల్లో సాగుపై ఆశక్తి సన్నగిల్లుతోంది. 100 ఏళ్ల నాటి ఉప్పు పరిశ్రమ కనుమరుగయ్యే పరిస్థితులు కళ్ల ముందు కనబడనున్నాయి.

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని కోనాడ తీరంలో 140 ఎకరాల్లో ఉప్పు గల్లీలున్నాయి. వీటిని గతంలో బ్రిటిష్ ప్రభుత్వం ఏర్పాటుచేసింది. సంవత్సరానికి వందలాది టన్నులు ఉప్పును ఉత్పత్తి చేసి ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు చేసేవారు. బ్రిటిష్ ప్రభుత్వం అనంతరం 1948 తరువాత భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ ఉప్పు గల్లీలు సాగవుతున్నాయి. ప్రస్తుతం రాజస్థాన్‌లోని జైపూర్‌లో ఉన్న సాల్ట్ డిపార్ట్‌మెంటు ఆధ్వర్యంలో రైతులు ఉప్పు సాగు చేస్తున్నారు. ఏళ్ల తరబడి రైతులు కేంద్ర ప్రభుత్వం నుండి కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నారు. వీరిలో విశాఖపట్నంకు చెందిన సివి శోభారాణి పెద్ద రైతు కాగా మిగతా వారంతా చిన్న సన్న కారు రైతులే సాగు చేస్తున్నారు. వీరంతా ఉప్పు సాగుపైనే ఆధారపడి జీవితాలు గడుపుతున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ సాధారణ ఉప్పుకు చెక్ పెట్టి అయోడెజ్డ్ మిశ్రమ ఉప్పును తెరపైకి తెచ్చింది. ప్రభుత్వాలు తీసుకున్న ఈ నిర్ణయం సాధారణ ఉప్పు పండించే రైతుల పాలిట శాపంగా మారింది. బ్రిటిష్ కాలం నుండి ఏళ్ల తరబడి ఉప్పు సాగుపై ఆధారపడి జీవిస్తున్న రైతులు సంక్షోభంలో చిక్కుకొని విలవిల లాడుతున్నారు. మార్కెట్‌లోకి అయోడైజ్డ్ ఉప్పు రంగప్రవేశం చేయడంతో సాధారణ ఉప్పుకు గిరాకీ తగ్గింది. దాంతో కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర రాక రైతు అప్పుల పాలవుతున్నారు. ఒకప్పుడు వందలాది ఎకరాల్లో సాగయ్యే ఉప్పు నేడు 40 ఎకరాల్లో మాత్రమే సాగు చేస్తున్న పరిస్థితి నెలకొంది. పండించిన పంటకు పెట్టుబడి రాకపోవడంతో కొంతమంది రైతులు సాగును మానుకున్నారు. దాంతో సుమారుగా 100 ఎకరాల ఉప్పు గల్లీలు మూడు సంవత్సరాలుగా బీడు భూములుగా మారిపోయాయి. ఉప్పు ధరలు ఒక్కసారిగా పడిపోవడంతో ఈ దుస్థితి దాపురించిందని రైతులు చెబుతున్నారు. లారీ ఉప్పు ధర ఒక్కసారిగా రూ.18 వేల నుండి రూ.12 వేలకు పడిపోయింది. దాంతో సాగుకు పెట్టే మధుపైనా రాకపోవడంతో రైతులు అప్పుల పాలవుతున్నారు. ఈ ఏడాది మార్చిలో పండించిన పంటను అమ్ముకోవడానికి రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. కష్టపడి పండించిన ఉప్పును అమ్ముకోలేక గల్లీలు వద్ద టన్నుల కొలది ఉప్పు మూలుగుతోంది. దాంతో ఈ ఏడాది పండించిన పంటకు ధర కూడా వస్తుందన్న నమ్మకం రైతుల్లో కనబడడంలేదు.



మరోవైపు కూలీ రేట్లు విపరీతంగా పెరిగిపోవడంతో పాటు ఉప్పు ధర తగ్గిపోవడంతో ఈ సాగుపై ఆశక్తి సన్నగిల్లుతుంది.

ఒకప్పుడు వందలాది టన్నుల ఉప్పు ఇక్కడ నుండి ఎగుమతయ్యేది. సాధారణ ఉప్పు వాడకం తగ్గడంతో నేడా ఆ పరిస్థితి కనిపించడంలేదు. లీజు సమయం పెంచి, అయోడైజ్డ్ ఉప్పు తయారీ మిషనరీ ఇచ్చి తీరంలో ఏళ్ల తరబడి ఉప్పు సాగుపై ఆధారపడుతున్న తమను ప్రభుత్వం ఆదుకోవాలని ఉప్పు రైతులు కోరుతున్నారు.

వనరులు పుష్కలం.. అందిపుచ్చుకుంటే అందలం

ప్రజాశక్తి-పూసపాటిరేగ

ఒకప్పుడు ఈ ప్రాంతమంతా విజయనగర గజపతుల పాలనలో ఉండేది. కాలక్రమేణా వచ్చిన మార్పుల్లో విశాఖపట్నం జిల్లాలోకి వెళ్లింది. విజయనగరం జిల్లా ఏర్పడిన తర్వాత ఇందులో అంతర్లీనమైంది. 1985 మేలో మండల వ్యవస్థ రావడంతో పూసపాటిరేగ మండల కేంద్రంగా ఆవిర్భవించింది. మండలంలో ప్రస్తుతం 27 పంచాయతీలు, 36 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. ఒక ఎంపిపి, జెడ్‌పిటిసి స్థానాలతోపాటు, 20 ఎంపిటిసి స్థానాలు, 27 పంచాయతీలు ఉన్నాయి. 14 కిలో మీటర్ల సువిశాలమైన సముద్ర తీరం ఉంది. తీరం వెంబడి 14 మత్స్యకార గ్రామాలుఉన్నాయి. నాతవలస బ్రిడ్జి నుంచి కందివలస బ్రిడ్జి వరకూ 14 కిలో మీటర్ల జాతీయ రహదారి విస్తరించి ఉంది. ఎటు చూసినా ప్రకృతి అందాలతో పరవశింపజేసే ఈ మండలం పలు సమస్యలతో సతమతమవుతూ అభివృద్ధిలో వెనుకబడే ఉంది. ప్రజలు కాలుష్య కోరల్లో చిక్కుకొని సమస్యలతో అనునిత్యం పోరాడుతూనే జీవనం కొనసాగిస్తున్నారు.

కాలుష్యంతో సతమతం

పరిశ్రమల నుంచి వెదజల్లుతున్న కాలుష్యంతో మండల ప్రజలు తీవ్రంగా ఇబ్బందులకు గురువుతున్నారు. మండలంలోని మైలాన్, సిపి ఆక్వా, ఎస్ఎంఎస్, హెచ్‌బిఎల్, వేధా బయోఫ్యూయల్, విజయనగర్ బయోటెక్ పరిశ్రమలు ఉన్నాయి. వీటిలో మైలాన్, ఎస్ఎంఎస్, హెచ్‌బిఎల్, వేధా బయోఫ్యూయల్ పరిశ్రమల ద్వారా వస్తున్న కాలుష్యం వల్ల పలు గ్రామాల్లో భూగర్భ జలాలు కలుషితమయ్యాయి. చెరువులు , పంట పొలాలు నాశనమవుతున్నాయి. కందివలస, కనిమెళ్ల, కామవరం, అల్లాడపాలెం, చోడమ్మ అగ్రహారం, జి.చోడవరం గ్రామాల్లో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. మండలంలో ఎక్కువ శాతం ప్రజలు కీళ్ల నొప్పులు, కిడ్నీ సమస్యలు, శ్వాస కోస వ్యాధులతో బాధపడుతున్నారు. కాలుష్య నియంత్రాణాధికారులకు ప్రజలు ఎన్నిసార్లు మొత్తుకున్నా ప్రయోజనం లేదు. దీంతో కాలుష్యం బాధపడలేక కొంత మంది ఉన్న ఊరును వదిలివెళ్లిపోతున్నారు. జీవన ప్రమాణాలు తగ్గిపోతున్నాయి.

కలగానే మిగిలిన ఇఎస్ఐ ఆసుపత్రి

మండలంలోని వివిధ పరిశ్రమల్లో పనిచేస్తున్న సంఘటిత, ఆసంఘటిత రంగ కార్మికులు సుమారుగా పది వేల మంది ఉన్నారు. పరిశ్రమల్లో వెదజల్లుతున్న కాలుష్యం వల్ల అనేక మంది రోగాల బారినపడుతున్నారు. మండలంలో ఇఎస్ఐ ఆసుపత్రి లేక అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. చిన్న చిన్న రోగాలకు కూడా వేలాది రూపాయలు ప్రవేటు డాక్టర్లకు ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇఎస్ఐ ఆసుపత్రి మండలంలో పెట్టాలని సిఐటియు ఆధ్వర్యంలో ఎన్నిసార్లు వినతులిచ్చినా ఫలితం లేదు.

కలుషితమైన భూగర్భజలాలు

మండలంలోని ఏ గ్రామంలో చూసినా భూగర్భ జలాలు కలుషితమైపోయాయి. అల్లాడపాలెం, కందివలస, కనిమెట్ట, కనిమెల్ల, జి.చోడవరం, చోడమ్మ అగ్రహారం, కొవ్వాడ తదితర గ్రామాల్లో భూగర్భ జలాలు కలుషితమయ్యాయని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల పరిశీలనలో తేలింది. మిగతా గ్రామాల్లో బోర్లు, నేల బావిల్లో నీటిని తాగితే ఫ్లోరైడ్ కంటెంట్ వల్ల కీళ్ల నొప్పులతో, నడుం నొప్పులతో ప్రజలు సతమతమవుతున్నారు. మండలంలో ఫ్లోరైడ్ కంటెంట్ ఎక్కువగా ఉండడంవల్ల మండలానికి రూ.10కోట్లుతో పైలెట్ ప్రాజెక్టు నిర్మించారు. చంపావతి నది నుంచి నేరుగా తాగునీరు గ్రామాలకు సరఫరా చేయడానికి ఓవర్ హెడ్ ట్యాంకులను కూడా నిర్మించారు. నది నుంచి నీరు సరఫరా అవుతున్న పైపులు సరిగ్గా లేకపోవడంతో గ్రామాల్లో ఓవర్ హెడ్ ట్యాంకులకు అరకొరగా నీరు సరఫరా అవుతుంది. ఆ నీరు గ్రామస్తులకు చాలక స్థానిక బోర్లులో నీటిని ట్యాంకులకు పంచాయతీ సిబ్బంది ఎక్కిస్తున్నారు. దీంతో మళ్లీ ఫ్లోరైడ్ నీటినే తాగాల్సిన పరిస్థితి ఏర్పడింది.

బస్సు షెల్టర్ లేక ఇబ్బందులు

మండల కేంద్రంలో బస్సు షెల్టర్ లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హైదరాబాద్, విశాఖ, విజయవాడ, విజయనగరం, శ్రీకాకుళం, ఒడిశాకు వెళ్లడానికి ఇదే రహదారి. దీంతో అనునిత్యం వేలాది మంది ప్రయాణీకులు మండల కేంద్రం జాతీయ రహదారిపై బస్సుల కోసం వేచి చూస్తారు. ప్రయాణీకులు వేచి ఉండడానికి నిలువ నీడ లేదు. దీంతో వృద్ధులు, బాలింతలు, గర్భిణులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటారు.

ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటు చేయాలి

మండలంలో నాతవలస జంక్షన్ నుంచి అల్లాడపాలెం జంక్షన్ వరకూ సుమారుగా 10కిలోమీటర్ల జాతీయ రహదారి ఉంది. ఈ రహదారి గుండా నిత్యం వేలాది వాహనాలు వెళ్తుంటాయి. దీంతో అను నిత్యం ఏదో ఒక చోట రోడ్డు ప్రమాదం జరుగుతూనే ఉంటుంది. క్షతగాత్రలకు సకాలంలో వైద్యమందక తీవ్ర ఇబ్బందులకు గురవుతుంటారు. జాతీయ రహదారిని ఆనుకొని ట్రామాకేర్ సెంటర్ పెడతామని అధికార్లు పలుమార్లు చెప్పినా ఫలితం లేకపోయింది. జాతీయ రహదారి ఆనుకొని ఉండడంతో ఇక్కడ ట్రమాకేర్ సెంటర్ అవసరం ఎంతయినా ఉంది.

రామతీర్థ సాగర్ ప్రాజెక్ట్ త్వరితగతిన పూర్తిచేయాలి

మండలంలోని భూములు వర్షాదాధారంపైనే ఆధారపడి పంటలు పండుతాయి. దీంతో మండలంలోని కుమిలిలో 2007లో రామతీర్థ సాగర్ నిర్మాణం చేపట్టారు. ఆ ప్రాజెక్టు నిర్మాణమైతే మండలంలో సుమారుగా వెయ్యి హెక్టార్లకు సాగునీటి సౌకర్యం కలుగుతుంది. కానీ ఏళ్లు గడుస్తున్నా కుమిలిలో చేపట్టిన బండ నిర్మాణమే ఇప్పటి వరకూ పూర్తి కాలేదు. దీంతో రైతులకు సాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పట్లో పూర్తవుతుందన్న నమ్మకం కూడా రైతన్నలకు లేదు. ప్రాజెక్ట్ పూర్తి చేస్తే ఈ ప్రాంతం సస్యశ్యామలమవుతుంది.

పట్టాల కోసం ఎదురు చూపు

మండలంలోని కొళ్లాయివలస, చినబత్తివలస, పెదబత్తివలసలో గిరిజనులు, దళితులు ప్రభుత్వ భూములను ఎప్పటి నుంచో సాగు చేసుకుంటున్నారు. సాగు చేస్తున్న భూములు పట్టాల కోసం ఎదురు చూస్తున్నారు. ఏడో విడత భూపంపిణీలో పట్టాలిస్తారని ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం మండలం ఉడా పరిధిలో ఉండడం వల్ల భూ పంపిణీకి బ్రేకులు పడ్డాయి. ఇకపై మండలంలో భూ పంపిణీ ఉండదన్నది అధికార్లు చెబుతున్నారు.

జట్టీ ఏర్పాటు చేయాలి

మండలంలో సుమారుగా 10 వేల మంది మత్స్యకారులు ఉన్నారు. వీరిలో 4 వేల మంది మత్స్యకారులు వేటపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. తీరంలో జట్టీలు లేక వీరంతా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. జట్టీ లేకపోవడంతో నిత్యం వేటకు వెళ్లే ముందు పడవలను సముద్రంలోకి తీసుకెళ్లేందుకు తీవ్రంగా కష్టపడాల్సి వస్తుంది. జట్టీ లేకపోవడంతో కొంతమంది పడవలను సముద్రంలోనే లంగరు వేసి వదిలేస్తున్నారు. తుపాన్ల సమయంలో ఈ బోట్లు కొట్టుకు పోతున్నాయి. జట్టీ ఉంటే బోట్లును తీరం ఒడ్డుకు తెచ్చి జట్టీకు కట్టుకునే అవకాశం ఉంటుంది. జట్టీ నిర్మాణానికి మత్స్యకారులు చాలా కాలంగా ఎదురు చూస్తున్నారు.

కలగా మిగిలిన ఫైర్ స్టేషన్

మండలంలోని సుమారుగా 60 గ్రామాలు ఉన్నాయి. కొన్ని గ్రామాల్లో నేటికీ వందలాది తాటాకు ఇళ్లు ఉన్నాయి. ఈ ప్రాంతంలో ఏటా పదుల సంఖ్యలో ఇళ్లు అగ్ని ప్రమాదానికి గురవుతున్నాయి. అగ్ని ప్రమాదం జరిగిన సమయంలో విజయనగరం, రణస్థలం నుంచి అగ్ని మాపక దళం వచ్చే వరకూ వేచి చూడడంతో ఇళ్లు కాలిబూడిదవుతున్నాయి. దీంతో బాధితులకు తీవ్రనష్టం వాటిల్లుతుంది. మత్స్యకార గ్రామాల్లో ఈ ప్రమాదాలు మరీ ఎక్కువగా జరుగుతున్నాయి. పాలకులు ఫైర్ స్టేషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.







